ప్రజాశక్తి

బుధవారం 17 మే 2023 | 8 పేజీలు

ఎన్‌టిఆర్ | కృష్ణా

మత్స్యకార భరోసాను పంపిణీ చేస్తున్న కలెక్టర్ రాజాబాబు

మత్స్యకార భరోసా రూ.12.47 కోట్లు జమ

ప్రజాశక్తి – కలెక్టరేట్ (కృష్ణా) : వైఎస్ఆర్ మత్స్యకార భరోసా కింద మంగళవారం కృష్ణాజిల్లాలో 12,470 మంది లబ్ధిదారులకు రూ.12.47 కోట్లను కలెక్టరు పి.రాజాబాబు పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహనరెడ్డి బాపట్ల జిల్లా నిజాంపట్నంలో ఈ పథకం కింద చేపల వేట నిషేధ భతిని బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాలో జమచేశారు. కృష్ణాజిల్లా కలెక్టర్ మచిలీపట్నంలోని కలెక్టర్ కార్యాలయం నుండి వీడియోకాన్ఫరెన్సు ద్వారా పాల్గొన్నారు. ఈసందర్భంగా కలెక్టర్ రాజాబాబు మాట్లాడుతూ సముద్రాన్నే నమ్ముకున్న మత్స్యకార కుటుంబాలను చేపల వేట నిషేధకాలంలో ఆదుకుని వారి జీవనోపాధి నిమిత్తం ఆర్థిక సాయం అందించేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న వైయస్ఆర్ మత్స్యకార భరోసా వరుసగా 5వ ఏడాది అమలు చేస్తున్నామని తెలిపారు. జిల్లాలో గత నాలుగు విడతల్లో రూ.38 కోట్లు పంపిణీ చేయగా, 5వ విడతగా 12,470 మత్స్యకార లబ్ధిదారుల కుటుంబాలకు రూ.10 వేల చొప్పున రూ.12.47 కోట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. కృష్ణాజిల్లాలో నాలుగు తీర ప్రాంత మండలాలైన మచిలీపట్నం, కోడూరు, నాగాయలంక, కత్తివెన్నుల్లోని 64 మత్స్యకార గ్రామాల్లో 50 వేల మత్స్యకార జనాభా ఉందని తెలిపారు. జిల్లాలో 2,207 మెకనైజ్, మోటరైజ్డ్, నాన్మోటరైజ్డ్ బోట్లు ఉన్నాయని, చేపల వేట చేసే కుటుంబాలకు వేట నిషేధభతి పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో మచిలీపట్నం మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, డిఆర్ఓ ఎం. వెంకటేశ్వర్లు, జిల్లా మత్స్యకార శాఖాధికారి ఎ. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నిప్పుల కొలిమి

నిర్మానుష్యంగా రహదారులు
శీతలపానీయాలకు గిరాకీ

ప్రజాశక్తి–కృష్ణాప్రతినిధి

కృష్ణాజిల్లాలో వేసవి ఎండలు మండిపోతున్నాయి. ఎండ దెబ్బకు ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఇళ్లల్లో నుంచి బయటకు రావాలంటేనే హడలిపోతున్నారు. ఉదయం ఎనిమిది గంటల నుంచే ఎండ తీవ్రత మొదలవుతోంది. ముఖ్యమైన పనులు ఉంటే తప్ప బయటకు రావడం లేదు. నిత్యావరాల కొనుగోలుకు, ఇతర అవసరాలు కోసం ఇంటి నుంచి బయటకు వచ్చిన వారు త్వరత్వరగా పనులను ముగించుకుని తిరిగి ఇంటికి వెళ్లిపోతున్నారు. దీంతో ఉదయం 11.30 గంటలకే రహదారులన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఎండల తీవ్రతకు వివిధ అవసరాల కోసం బస్సుల్లో ప్రయాణించే ప్రయాణీకులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలోనే స్వచ్ఛంద సంస్థలు కొన్ని పట్టణ కూడళ్లు, గ్రామాల్లో వేసవి (మిగతా 6లో)

ఉష్ణోగ్రతల వివరాలు

మండలం పేరు	నమోదైన ఉష్ణోగ్రత (డిగ్రీల్లో)		
మొవ్వ	44.59	తోట్లవల్లూరు	43.70
పెనమలూరు	44.57	పమిడిముక్కల	43.59
చల్లపల్లి	44.17	బాపులపాడు	43.70
నందివాడ	44.10	కంకిపాడు	43.48
నాగాయలంక	44.10	గన్నవరం	43.18
ఉంగుటూరు	44.00	మచిలీపట్నం	43.00
పెదపారుపూడి	43.96	బంటుమిల్లి	42.79
పామర్రు	43.86	గుడ్లవల్లేరు	42.79
ఘంటసాల	43.74	అవనిగడ్డ	42.5
గూడూరు	43.71	మోపిదేవి	42.33
		కృత్తివెన్ను	41.80
		గుడివాడ	40.70

అత్యధికంగా కంచికచర్లలో 48 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

ప్రజాశక్తి - కంచికచర్ల : జిల్లావ్యాప్తంగా మంగళవారం ఎండతీవ్రత మరింత పెరిగింది. గడచిన రెండు రోజుల కన్నా రెండు డిగ్రీల ఉష్ణోగ్రత పెరిగింది. తీవ్ర వడగాలులు వీశాయి. దీంతో నిప్పల కొలిమిలో ఉన్నట్లుగా జనం అల్లాడి పోయారు. మంగళవారం కంచికచర్లలో అత్యధికంగా 48 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఈ ఏడాది నమోదైన ఉష్ణోగ్రతల్లో ఇదే అత్యధికమని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. నందిగామలో 47 , విజయవాడలో 46 డిగ్రీల చొప్పున నమోదైంది. ఉదయం 7 గంటల నుండే ఎండ తీవ్రత పెరిగింది. 10 గంటలకు జనం బయట ఉండలేక పోయారు. ఎండ తీవ్రతకు ఉపాధి హామీ కార్మికులు, పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు (మిగతా 6లో)

19న సుందరయ్య వర్ధంతి సభ
హాజరుకానున్న వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి - విజయవాడ : ఈనెల 19వ తేదీ సాయంత్రం 6 గంటలకు విజయవాడ లెనిన్ సెంటరులో దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత, పీడిత ప్రజల ప్రియతమ నేత పుచ్చలపల్లి సుందరయ్య 38వ వర్ధంతి సభ జరుగుతుందని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సభలో వక్తలుగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు పాల్గొంటారని తెలిపారు. సభకు ముందు వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయని పేర్కొన్నారు. ఈ సభలో ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కాశీనాథ్ కోరారు.

21న అన్నమయ్య గ్రంథాలయ సందర్శన యాత్ర
ఔత్సాహికులకు ఆహ్వానం

ప్రజాశక్తి - విజయవాడ : గ్రంథాలయాలు మన జాతి విజ్ఞాన సంపదలని, వాటిని గుర్తించి గౌరవించడం ప్రతి ఒక్కరి విధి అని భావించిన ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం ప్రప్రథమంగా 100 ఏళ్ల పూర్తి చేసుకున్న ప్రకాశం జిల్లా వేటపాలెంలోని 'సారస్వతి నికేతనమ్' గ్రంథాలయ సందర్శన యాత్రను ప్రారంభించిందని సంఘం రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సోమేపల్లి వెంకట సుబ్బయ్య, చలపాక ప్రకాష్ ఒక ప్రకటనలో తెలిపారు. దీనిలో భాగంగా ఈఏడాది వేలాది పుస్తక సంపదను కలిగి ఉన్న గుంటూరులోని 'అన్నమయ్య గ్రంథాలయ సందర్శన యాత్ర'కు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఈనెల 21వ తేదీ ఉదయం తెలుగు రాష్ట్రాలలోని రచయితలు, కవులతో గ్రంథాలయ సందర్శన యాత్రను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఘనకీర్తిని చాటేవిధంగా 77 మంది కవులతో తీర్చిదిద్దిన 'మన ఆంధ్రప్రదేశ్' కవితా సంకలనాన్ని ప్రఖ్యాత కవి, విమర్శకులు డాక్టర్ పాపినేని శివశంకర్, డాక్టర్ ఉప్పలధడియం వెంకటేశ్వర హైకూ సంపుటి 'విత్తనం'ను ప్రముఖ కవి అడిగోపుల వెంకటరత్నం ఆవిష్కరిస్తారని, ఇతర రచయితల పుస్తకావిష్కరణలు కూడా ఉంటాయని (మిగతా 6లో)

కమిటీల ఏర్పాటుపై నిర్లక్ష్యం

- గడువు ముగిసినా స్పందించని విఎంసి అధికారపక్షం
- కార్పొరేటర్ల టూర్‌పైనే శ్రద్ధ !
- సాంప్రదాయాలు, నిబంధనలను విస్మరిస్తున్న వైనం

ప్రజాశక్తి - విజయవాడ

విజయవాడ నగరపాలక సంస్థ ప్రత్యేక (స్పెషల్) కమిటీలను ప్రతి రెండేళ్లకు, స్టాండింగ్ కమిటీ (స్థాయీ సంఘం) సభ్యులను ప్రతి ఏడాదికి అధికారపక్షం ఎంపిక చేస్తుంది. అయితే ఈసారి 11 ప్రత్యేక కమిటీల పదవీకాలం గత జనవరితో ముగిసినా నూతన కమిటీలకు సంబంధించిన చైర్మన్, వైస్ చైర్మన్, సభ్యుల ఎంపిక నేటికీ జరగలేదు. కమిటీల ఏర్పాటును పక్కన పెట్టిన అధికార వైసిపి నేతలు ఈ నెలాఖరు నుండి వచ్చే నెల 14వ తేదీ వరకు ఏర్పాటు చేసుకున్న విజ్ఞాన (విహార) యాత్ర ప్లాన్‌పై బిజీబిజీగా ఉన్నారు. ఈ పర్యటనకు ఎవరెవరు వెళ్లాలో జాబితా కూడా సిద్ధం చేశారు. నగరాభివృద్ధిలో పాలనాపరమైన అంశాలు, వాటి నిర్ణయాల్లో కౌన్సిల్‌తోపాటు స్టాండింగ్ కమిటీ, ప్రత్యేక కమిటీల పాత్ర ఉంటుంది. ఇంత ప్రాధాన్యత కలిగిన ప్రత్యేక కమిటీల ఏర్పాటు అంశాన్ని అధికార వైసిపి పూర్తిగా విస్మరించిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. నగరాభివృద్ధి, ప్రజాసమస్యలపై ధ్యాస ఏమోగానీ వ్యక్తిగత అంశాలు, వారి వ్యవహారాలు చక్కబెట్టుకునే దానిపైనే ఎక్కువగా అధికార వైసిపి దృష్టి సారిస్తోందని చెప్పడానికి ఈ ప్రత్యేక కమిటీల ఏర్పాటుపై చూపుతున్న అశ్రద్ధే నిదర్శనంగా ఉందని చెప్పక తప్పదు. ఒక కమిటీ కాలపరిమితి రెండేళ్లు. అయితే గత జనవరి నాటికే ప్రస్తుతం ఉన్న కమిటీల కాల వ్యవధి పూర్తయింది. వెంటనే నూతన సభ్యులతో కమిటీలను ఏర్పాటు చేయాల్సి ఉన్నా ఆ దిశగా నిర్ణయం చేయకపోవడం శోచనీయం. పాత కమిటీల కాల వ్యవధి (మిగతా 6లో)

బిజెపితో కలిసే పార్టీల అడ్రస్ గల్లంతు

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు హెచ్చరిక

ప్రజాశక్తి - ఉయ్యూరు : వచ్చే ఎన్నికల్లో బిజెపితో కలిసి పయనించే పార్టీల అడ్రస్సులు గల్లంతవుతాయని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు హెచ్చరించారు. కృష్ణాజిల్లా ఉయ్యూరులో మంగళవారం సాయంత్రం "రాజ్యాంగ, ప్రజాస్వామ్య పరిరక్షణ" అంశంపై బహిరంగ సదస్సు జరిగింది. ఈ సదస్సులో పలు రాజకీయ పార్టీలకు చెందిన రాష్ట్ర, జిల్లాస్థాయి నేతలు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. సదస్సు నిర్వాహకులు, సామాజిక కార్యకర్త జి.వి.నాగేశ్వరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వి శ్రీనివాసరావు మాట్లాడుతూ బిజెపితో కలిసి పనిచేసే పార్టీలను ప్రజలు తిప్పికొడతారని వైసిపి, టిడిపి, జనసేనలను హెచ్చరించారు. రాష్ట్ర ప్రజల ఆత్మగౌరవాన్ని ఢిల్లీలో తాకట్టు పెట్టిన ఘనత ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. రాష్ట్రంలో రాజన్న రాజ్యాన్ని తెస్తానన్న జగన్....మోడీ రాజ్యాన్ని తెస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో బిజెపి విధానాలను అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. చమురును చౌక ధరకు కొనుగోలు చేస్తున్న కేంద్రం...దేశంలో పెట్రోలు, డీజిల్ ధరలు పెంచి ప్రజలపై భారాలు మోపుతోందన్నారు. దేశవ్యాప్తంగా మతవిద్వేషాలను రెచ్చగొడుతూ ముస్లిం మైనార్టీలను, దళితులను, మహిళలను అణగదొక్కుతున్న బిజెపి ప్రభుత్వానికి ప్రజలే తగిన విధంగా బుద్ధి చెబుతారని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు నరహరిశెట్టి నరసింహారావు మాట్లాడుతూ స్వతంత్ర విదేశాంగ విధానాన్ని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నాశనం చేసిందన్నారు. అంతర్జాతీయ రాజకీయ పరిణామాల్లో అమెరికా (మిగతా 6లో)

మహాయజ్ఞం ముగింపునకు గవర్నర్, సిఎం

ఇందిరాగాంధీ స్టేడియంలో భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన సిపి

ప్రజాశక్తి-విజయవాడ: విజయవాడ ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియంలో మహాయజ్ఞం ముగింపు సందర్భంగా బుధవారం నిర్వహించే పూర్ణాహుతి కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్ అబ్దుల్‌నజీర్, ఎపి సిఎం వైఎస్‌జగన్మోహన్‌రెడ్డి రాక సందర్భంగా తీసుకోవాల్సిన భద్రతా ఏర్పాట్లను ఇతర శాఖల అధికారులు, డిసిపి విశాల్‌గున్నితో కలిసి నగర పోలీసు కమిషనర్ కాంతి రాణా టాటా మంగళవారం పరిశీలించారు. లా అండ్ ఆర్డర్ , ట్రాఫిక్ పరంగా ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పూర్తి ట్రయిల్ రన్‌ను నిర్వహించి అధికారులకు , సిబ్బందికి సిపి తగిన సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా నగర పోలీస్ కమీషనర్ మాట్లాడుతూ అధికారులు, సిబ్బంది బందోబస్తు ఏర్పాట్లలో ఎక్కడా ఎటువంటి అలసత్వం ప్రదర్శించకుండా భద్రతా పరంగా ఆయా శాఖలతో సమన్వయం చేసుకొని స్టేడియం, దాని పరిసర ప్రాంతాలలో పటిష్ట బందోబస్త్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ట్రాఫిక్ పరంగా ఎటువంటి ఇబ్బందులు లేకుండా, ఎటువంటి ప్రమాదాలు, అవాంచనీయ సంఘటనలు జరుగకుండా అన్ని శాఖల సమన్వయంతో తగిన చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. మొత్తం 1200 మంది పోలీస్ అధికారులు, సిబ్బందితో పటిష్టమైన బందోబస్త్ ఏర్పాటు చేశామన్నారు. లా ఆర్డర్ పోలీస్, ట్రాఫిక్ పోలీస్ , అన్ని శాఖల సమన్వయంతో ఈ కార్యక్రమమును విజయవంతంగా పూర్తి చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖా మంత్రి కొట్టు సత్యనారయణ, సబ్ కలెక్టర్ ఆదితిసింగ్, పోలీసుల అధికారులు పాల్గొన్నారు.

అధికారులతో చర్చిస్తున్న సిపి

బజాజ్ మ్యాక్సిమా ఆటో ఆవిష్కరణ

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: పట్టణంలో సాయిబాబా గుడి సమీపంలో గల ఫంక్షన్ హాలులో మంగళవారం బజాజ్ కంపెనీ వారు బియస్ 6, ఓబిడి 2ఎ ల కొత్త ఆటో లను లాంచ్ చేశారు. లాంచ్ చేసిన ఆటోలను బజాజ్ కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సత్యనారాయణ, జగ్గయ్యపేట పట్టణ బజాజ్ షోరూం చౌడవరపు జగదీష్, నర్సింహారావు లు రిబ్బన్ కట్టింగ్ చేసి ప్రారంభించారు. అనంతరం కంపెనీ మేనేజ్ మెంట్ వారు ఆటో డ్రైవర్ లతో మాట్లాడుతూ ఈ కొత్త మోడల్ ఆటోలైన బజాజ్ మ్యాక్సిమా ప్యాసింజర్ ఆటో మంచి పికప్ ని ఇస్తుందని, మైలేజ్ పెరుగుతుందని, రోడ్డు గ్రిప్ మెరుగులగా ఉంటుందని కంపెనీ వారు ఆటో డ్రైవర్ లకు తెలిపారు. బజాజ్ మ్యాక్సిమా సియక్సెల్ ట్రాలీ ఆటో ఆరు అడుగుల ట్రే తో, టైర్ పంచర్ అయిన ఆగకుండా గమ్యానికి చేర్చగలిగే సామర్థ్యం కలిగి ఉందని, టైర్లు నలగటం, ట్యూబ్ ఖర్చులు ఉండవని బజాజ్ కంపెనీ వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ఏయస్‌ఓ ప్రవీణ్, కంపెనీ సిబ్బంది అప్పారావు, మరియు ఆటో డ్రైవర్ లు పాల్గొన్నారు.

8వ వార్డులో కమిషనర్ పర్యటన

ప్రజాశక్తి-నందిగామ: నందిగామ పట్టణ పరిధిలో ఎనిమిదవ వార్డులో మంగళవారం మున్సిపల్ కమిషనర్ డాక్టర్ ఎస్ జయరాం పర్యటించారు. ప్రతిరోజూ అంతర్గత రోడ్లు శుభ్రం చేయించాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. కాలవలలో పూడికను ఎప్పటికప్పుడు తొలగించాలని తెలిపారు.దోమల నివారణకు తీసుకుంటున్న చర్యలు గురించి అడిగి తెలుసుకున్నారు. రైతుపేట డౌన్లో ప్రధాన కాలవను పరిశీలించారు. ఎప్పటికప్పుడు ప్రధాన కాలవలలో బాబ్ కాట్ ను ఉపయోగించి పూడికలను తొలగించాలని ఆదేశించారు. మురుగు కాలవల వెంట పిచ్చి మొక్కలను ఎప్పటికప్పుడు తొలగించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం కాల్వలలో దోమల మందు పిచికారి చేయించడం తో పాటు సున్నం, బ్లీచింగ్ చల్లించారు. ఈ కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యులు యం.దాసు, వార్డు ఇంచార్జ్ గుడివాడ సాంబశివరావు పాల్గొన్నారు.

రైతుబజార్లో మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి-నందిగామ: నందిగామ పట్టణంలోని రైతు బజార్ నందు తీవ్రమైన ఎండలు దష్ట్యా ఎస్టేట్ ఆఫీసర్ రావెళ్ల అజయ్ కుమార్ సూచనల మేరకు రెండవ రోజు వినియోగదారులకు చల్లని మజ్జిగను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు బజార్ ఎస్టేట్ ఆఫీసర్ అజయ్ కుమార్ పాల్గొన్నారు.

బాలలకు ఇంగ్లీషు బోధన

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: కృష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో జగ్గయ్యపేట గ్రేడ్ 1 శాఖా గ్రంథాలయంనందు తొమ్మిదోవ రోజు మంగళవారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12. గంటల వరకు వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరం నందు పుస్తకాలు చదివించడం, విద్యార్థులచే కథలు చేపించడం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు ఉపాధ్యాయులు వినోద్ కుమార్ ఇంగ్లీష్ గ్రామర్ లో "పార్ట్స్ ఆఫ్ స్పీచ్ "లో నేర్పించారు. ఈ కార్యక్రమంలో కవి, ఉపాధ్యాయులు దోశపాటి నాగేశ్వరరావు, గ్రంథ పాలకురాలు శ్రీమతి ఆలేటి ప్రభ, గ్రంథాలయ సిబ్బంది శ్యామలా, బి డి సీ మల్లిక, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

సంతకాల సేకరణ

ప్రజాశక్తి-వన్‌టౌన్: బ్రిజ్ భూషణ్‌ను వెంటనే అరెస్టు చేయాలని మహిళా సమాఖ్య నగర ప్రధాన కార్యదర్శి పంచదార దుర్గాంబ డిమాండ్ చేశారు. ఢిల్లీలో జరుగుతున్న మహిళా రెజ్లర్ల పోరాటానికి మద్దతుగా ఎన్‌ఎఫ్ఐడబ్ల్యు, పిఓడబ్ల్యు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం కొత్తపేట, నెహ్రూ బొమ్మ సెంటర్ వద్ద సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా సంఘం నాయకులు దుర్గాంబ మాట్లాడుతూ దేశానికి అవార్డులు తెచ్చిపెట్టిన అంతర్జాతీయ ఖ్యాతి పొందిన భారత స్టార్ మహిళ రెజ్లర్ల లైంగిక వేధింపులు ఫిర్యాదును నమోదు చేయకుండా తిరస్కరించటం దుర్మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో చైతన్య మహిళా సంఘం కో- కన్వీనర్ రాధా, అధ్యక్షులు భారతీ, సభ్యులు దుర్గాసి రమణమ్మ, సావిత్రి, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు ఎం సాయి కుమార్, లంక గోవిందరాజులు, లంకె సాయి, కిషోర్, 51వ డివిజన్ సిపిఐ కార్యదర్శి దాసిన నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

19న వలంటీర్లను సత్కరించనున్న సిఎం

ఎ ప్లస్ కన్వెన్షన్‌లో ఏర్పాట్ల పరిశీలన

ఏర్పాట్లపై మాట్లాడుతున్న రఘురామ్

ప్రజాశక్తి-విజయవాడ: ఈ నెల 19వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్లను ఘనంగా సన్మానించనున్న దృష్ట్యా మంగళవారం శాసనమండలి సభ్యులు, ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయకర్త తలశిల రాఘురామ్, జిల్లా కలెక్టర్ ఎస్ ఢిల్లీరావు, జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్ కుమార్, నగరపాలక సంస్థ మున్సిపల్ కమీషనర్ స్వప్నిల్ దినకర్ పుడ్కర్, సబ్ కలెక్టర్ అదితి సింగ్, నగరంలోని ఎ ప్లస్ కన్వెన్షన్ హాల్‌లో అధికారులతో కలిసి ఏర్పాట్లు పరిశీలించారు. ఈ సందర్భంగా రాఘురామ్ మాట్లాడుతూ ఎటువంటి లోటుపాట్లు లేకుండా వలంటీర్ల సన్మాన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. జిల్లాకు చెందిన రెండు వేల మంది వలంటీర్లను ఏ ప్లస్ కన్వెన్షన్ హాల్‌లో సన్మానించడం జరుగుతుందన్నారు. జిల్లా కలెక్టర్ ఎస్ ఢిల్లీరావు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఏ ప్లస్ కన్వెన్షన్ హాల్‌లో ఏర్పాట్లు సక్రమంగా పూర్తి చేయాలన్నారు. సీట్ల సర్దుబాటు, సౌండ్ సిస్టమ్, పోలీస్ బందోబస్తు, తదితర ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ పరిశీలనలో పార్లమెంట్ సభ్యులు నందిగం సురేష్, ప్రభుత్వ విద్య సంస్థల సలహాదారు ఆలూరి సాంబశివరెడ్డి, హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొవులూరి దొరబాబు, డిఆర్‌వో కె. మోహన్‌కుమార్, గ్రామ వార్డు సచివాలయ ప్రత్యేక అధికారి కె. అనురాధ తదితరులు ఉన్నారు.

కృష్ణా నీటిని అందించాలని వినతి

ప్రజాశక్తి-విజయవాడ రూరల్: అంబాపురం గ్రామంలో సుమారు మూడు వేల కుటుంబాలు నివసిస్తున్నారని, వారికి కృష్ణానీటిని అందించాలని వైసిపి ఎన్.చంద్రశేఖర్ సీఎం జగన్మోహనరెడ్డిని కోరారు. ఈ మేరకు నిజాంపట్నం లో కలిసి విన్నవించారు.గ్రామ పంచాయితీ సరఫరా చేసే త్రాగునీటిలో ఫ్లోరైడ్ శాతం కలిగి ఉండి ఆ నీటిని తాగే గ్రామ ప్రజలు తరచూ అనారోగ్యమునకు గురవుచున్నారని, అంబాపురం గ్రామం, విజయవాడ పట్టణానికి ఆనుకొని వుండి కూడా ఎన్నో సంవత్సరాలుగా కష్ణానది నీరు త్రాగు నీరుగా పొందలేక మా గ్రామ ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నో ప్రభుత్వాలు మారినా కూడా కష్ణానది త్రాగునీరు పైపులైను మా అంబాపురం గ్రామానికి మంజూరు చేయలేదని వివరించారు. తమ సమస్యను పరిష్కారించాలని కోరారు.

విద్యార్థులకు శిక్షణ

ప్రజాశక్తి-విజయవాడ: సమ్మర్ క్యాంప్‌లో భాగంగా చిత్తరంజన్ గ్రేడ్-2 శాఖాగ్రంథాలయంలో మంగళవారం విద్యార్థులతో నీతి కథలు చదివించడం, చెప్పించడం జరిగింది. అనంతరం స్పోకెన్ ఇంగ్లీష్, చిత్రం లేఖనం తరగతులు, చెస్, క్యారమ్స్, తదితర ఆటలు పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి పి.సంపత్ కుమార్, రికార్డు అసిస్టెంట్ కె.కృష్ణప్రణీత. వలంటీర్లు బి.వినోద్ కుమార్, స్పోకెన్ ఇంగ్లీష్ టీచర్, డ్రాయింగ్ టీచర్ ఎస్. సుజాత తదితరులు పాల్గొన్నారు.

డెంగ్యూ వ్యాధిపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-రెడ్డిగూడెం: జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా రెడ్డిగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సందేష్, డాక్టర్ చెన్నకేశవ మాట్లాడుతూ దోమలు వ్యాప్తి చెందకుడా జాగ్రత్తలు పాటించాలన్నారు. దోమలు ప్రబలకుండా ఇంటి పరిసరాలను ప్రతిరోజూ శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఓ శ్యాంసుందరరావు, పిహెచ్ఎన్ లక్ష్మి, హెల్త్ విసిటర్ భవానీ తదితరులు పాల్గొన్నారు.

రెడ్డిగూడెంలో...

ప్రజాశక్తి-వీరులపాడు: అల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ గౌతమ్‌బాబు ఆధ్వర్యంలో డెంగు వ్యాధి పట్ల అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ శ్రీనివాసరావు, వెంకటేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తినందిగామ:** అనాసాగరం అర్బన్ హెల్త్ సెంటర్ వద్ద జాతీయ డెంగ్యూ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. డాక్టర్ సత్యవతి, హాస్పిటల్ చైర్మన్ కరి రవీంద్ర డెంగ్యూ నివారణపై అవగాహన కల్పించారు.

జియో బిపి డీజిల్ ప్రారంభం

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్

వినియోగదారుల కోసం అత్యున్నత ప్రమాణాలు, యాక్టివ్ టెక్నాలజీతో కూడిన డీజిల్‌ను జియో బిపి ప్రారంభించినట్లు జియో బిపి సీఈవో హరీష్ సి మెహతా ఒక ప్రకటనలో తెలిపారు. కంపెనీ యొక్క నెట్‌వర్క్ విస్తరించే క్రమంలో కొత్త ఉత్పత్తులను తీసుకువస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా ట్రక్కు యజమానులకు 4.3 శాతం మెరుగైన ఇంధన సామర్థ్యాన్ని కలిగిస్తూ సంవత్సరాఇకి ఒకొక్క వాహనానికి రూ.1.1 లక్షల వరకు ఆదా చేస్తుందన్నారు. ఈకొత్త అధిక పనితీరు డీజిల్ అందచేత జియో బిపి ఔట్‌లెట్ల వద్ద అందిస్తున్నట్లు తెలిపారు. మార్కెట్‌లో మొట్ట మొదటిసారిగా ఎటువంటి అదనపు ఖర్చు లేకుండా మామూలు ధరలతోనే అందచేయనున్నట్లు తెలిపారు.

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి

కేంద్ర మంత్రి కౌసల్ కిషోర్

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్లను త్వరగా పూర్తి చేయాలని కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి కౌసల్ కిషోర్ అన్నారు. ఇబ్రహీంపట్నం కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఇబ్రహీంపట్నం సడక్ రోడ్‌లో వివిధ దశల్లో నిర్మాణంలో నిలిచిపోయిన ఇళ్లను మంగళవారం ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. స్వయంగా లబ్దిదారులతో మాట్లాడిన ఆయన అధికారుల నుండి వివరాలు సేకరించి త్వరగా లబ్దిదారులకు బిల్లులు అందేలా చేయాలని నిర్మాణం కూడా వేగవంతం చేయాలని ఆదేశించారు. కొండపల్లి మున్సిపాలిటీలో బోర్డు లేకపోవడం వల్ల రోడ్లు మరియు మౌళిక వసతులు లేవని స్థానిక బిజెపి నేతలు కేంద్రమంత్రికి వివరించారు. అధికారులతో మాట్లాడి మౌళిక సదుపాయాలు మరియు రోడ్ల సదుపాయాలు కల్పించే విధంగా చర్యలు తీసుకుంటానని ఆయన తెలిపారు. పేదల ఇళ్ల నిర్మాణంలో కేంద్ర ప్రభుత్వ సహకారం చాలా వరకు ఉందన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రతి పేదవాడికి ఇంటి సదుపాయం కల్పించాలని సంకల్పంతో ఉన్నార న్నారు. ఆయన సూచనతోనే ఇళ్ల నిర్మాణం పరిశీలించేందుకు వచ్చానని తెలిపారు. రాష్ట్రంలో పొత్తులపై కేంద్ర నాయకత్వం సరైన నిర్ణయం తీసుకుంటుందని అన్నారు.

లబ్దిదారులతో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కిషోర్

వరిగడ్డి దగ్ధం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ట్రాక్టర్‌పై వెళ్తున్న వరిగడ్డి దగ్ధమైన సంఘటన మండలంలోని వేదాద్రి గ్రామంలో మంగళవారం జరిగింది. సేకరించిన సమాచారం మేరకు గ్రామంలో తుమాటి నాగేశ్వరరావుకు చెందిన ట్రాక్టర్ వరిగడ్డితో వెళు తుండగా ట్రక్కు పైన గల వరిగడ్డి గ్రామంలో గల విద్యుత్ వైర్లకు అంటుకోవటంతో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా గడ్డివాము దగ్ధమైంది. సకాలంలో స్పందించిన జగ్గయ్యపేట అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన సంఘటన స్థలం వద్దకు వెళ్లి మంటలను ఆర్పారు. దీంతో పెద్ద ప్రమాదం తప్పింది. వరిగడ్డి మాత్రమే కాలిపోవడంతో 50 వేల రూపాయలు నష్టం వాటిలినట్లు తెలుస్తుంది.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు

పమిడిముక్కల మండల పరిషత్ సర్వ సభ్య సమావేశంలో ఎంపిపి వేదసుప్రజ

ప్రజాశక్తి-పమిడిముక్కల

ప్రస్తుత వేసవి సీజన్‌లో ఎండలు ముదిరిపోయిన నేపథ్యంలో ప్రజానీకానికి తాగునీటి ఎద్దడి లేకుండా గ్రామాల్లోని అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని పమిడిముక్కల

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ సుధాప్రవీణ్

మండల పరిషత్ అధ్యక్షురాలు కాసాని వేద సుప్రజ కోరారు. మండల కేంద్రమైన పమిడిముక్కలలోని మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో పమిడిముక్కల మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా కాసాని వేదసుప్రజ మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు పూర్తిస్థాయిలో జరిగేలా కృషిచేయాలన్నారు. పమిడిముక్కల తహశీల్దార్ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ జగనన్నకి చెబుదాం, స్పందన, ధాన్యం సేకరణ చెల్లింపులు, రీ సర్వే తదితర అంశాలపై వివరించారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్నందున సక్రమంగా అమలుకు కృషిచేయాలని కోరారు. మండల స్థాయిలో ప్రాజెక్టు మానిటరింగ్ యూనిట్ కమిటీ సమావేశమై ప్రజల నుండి వచ్చిన అర్జీల పరిష్కారానికి కృషిచేస్తుందన్నారు. పమిడిముక్కల మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ పదోతరగతిలో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మంచి మెరుగైన ఫలితాలు వచ్చాయన్నారు. నాడు-నేడు పనులు వేగవంతంగా జరుగుతున్నాయని వివరించారు. పమిడిముక్కల మండల పరిషత్ అభివృద్ధి అధికారి సుధా ప్రవీణ్ మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో లబ్ధిదారులకు అందేలా కృషిచేయాలని కోరారు. విద్య, వైద్యం, ఆరోగ్యం, వ్యవసాయం తదితర అంశాలపై నిర్దేశించిన లక్ష్యాల సాధనకు కృషిచేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థినికి పదో తరగతిలో ప్రథమ స్థానం రావడం గర్వకారణమని పమిడిముక్కల మండల పరిషత్ ఉపాధ్యక్షులు కొడమంచిలి మహేష్ అభినందించారు. ముస్లిం మైనార్టీల సంక్షేమానికి రాష్ట్రప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని కో ఆప్షన్ సభ్యులు మీర్జాదినాయత్ ఆలీ అన్నారు. ఎంపీటీసీ నిధులతో గ్రామాల్లో బోరు పంపులు వేయిస్తున్నామని మండల పరిషత్ ఉపాధ్యక్షులు గంజాల సీతారామయ్య అన్నారు. పమిడిముక్కల వ్యవసాయాధికారి గణేష్ రెడ్డి, పంచాయతీరాజ్ ఎఇ షరాబంది రాజు, హౌసింగ్ ఎఇ ప్రసాద్ తమ శాఖల ప్రగతితీరును వివరించారు. హనుమంతపురం, ఐనంపూడి గ్రామ సర్పంచ్‌లు కలపాల రాంబాబు, యేనుగు బేబీ, మంటాడ ఎంపీటీసీ మేరుగ లక్ష్మి, తాడంకి పంచాయతీ కార్యదర్శి సునీత, లంకపల్లి కార్యదర్శి విజయ దుర్గ, ఐనపూరు కార్యదర్శి స్వామి, చోరగుడి కార్యదర్శి రమణ, కపిలేశ్వరపురం కార్యదర్శి విద్యాధర్, పెనుమత్స సర్పంచ్ దండమూడి అచ్చమాంబ, ఆగినపర్రు గ్రామ సర్పంచ్ మణిరాజ్, పమిడిముక్కల, కపిలేశ్వరపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్లు అఖిల, బాలాజీ, అగినపర్రు కోపరేటివ్ బ్యాంక్ అధ్యక్షులు సతీష్, పమిడిముక్కల ఎంపీటీసీ గురుందపల్లి వంశీ, ముళ్ళపూడి గ్రామ సర్పంచ్ పక్కాల అంజిబాబు, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, వివిధశాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి హామీ చట్టాన్ని పరిరక్షించాలి

ప్రజాశక్తి - మొవ్వ

పేదలకు భరోసాగా ఉన్న ఉపాధి హామీ పథకాన్ని నీరు కార్చేందుకు కేంద్రప్రభుత్వం చేస్తున్న కుట్రలను ఐక్యంగా ప్రతిఘటించాలని ఎ.పి. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శీలం నారాయణరావు పిలుపునిచ్చారు. మొవ్వ మండలం, చిన్నముత్తేవి గ్రామంలో మంగళవారం క్షేత్రస్థాయిలో పర్యటించిన ఆయన ఉపాధి హామీ కూలీలను కలిసి వారి

మాట్లాడుతున్న శీలం నారాయణరావు

కష్టసుఖాలను అడిగితెలుసుకున్నారు. ఈ సందర్భంగా నారాయణరావు మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు అనేక రకాలుగా ప్రయత్నాలు చేస్తోందన్నారు. పేదల కడుపు కొట్టేలా ఉన్న కేంద్ర విధానాలను ఐక్యంగా వ్యతిరేకించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేఖ విధానాలపై ఉపాధి కార్మికులకు అవగాహన కల్పించారు. వేసవి ఎండ తీవ్రత అధికంగా ఉండి వడగాల్పులు వీస్తున్న నేపథ్యంలో పని ప్రదేశాలలో ఉపాధి కూలీలు సేదదీరేందుకు షామియానాలు, దాహార్తిని తీర్చుకునేందుకు మంచినీరు, మజ్జిగ ఏర్పాటు చేయాలన్నారు. 600 రూపాయిల వేతనంతో 200 పనిదినాలు కల్పించాలని, మేట్లకు పారితోషకాలు ఇవ్వాలని, ఫీల్డ్ అసిస్టెంట్లుకు రూ.26 వేలు వేతనంగా అందించాలని కోరారు.

భవన నిర్మాణ కార్మిక సంఘం నేత పెదబాబు మృతి

ప్రజాశక్తి-పెదపారుపూడి

పెదపారుపూడి మండలం యలమర్రు గ్రామానికి చెందిన భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు వేము ప్రసాదరావు (పెదబాబు) సోమవారం అనారోగ్యంతో మృతిచెందారు. ఆయన గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్నారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు చౌటుపల్లి రవి, జిల్లా ప్రధాన కార్యదర్శి మాదల వెంకటేశ్వరరావు, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కెవి గోపాలరావు, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు ఒడుగు గంగాధర్ ప్రసాద్, సిఐటియు పెదపారుపూడి మండల కార్యదర్శి ఉప్పలపాటి అనూష, వేము వెంకటేశ్వరరావు, సిపిఎం, సిఐటియు, భవన నిర్మాణ కార్మిక సంఘం పామర్రు మండల కమిటీల నాయకులు తీవ్ర సంతాపం తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి :ఉయ్యూరు

కాటూరు సబ్ స్టేషన్ పరిధిలో గ్రామాలలో బుధవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4గంటలవరకు విద్యుత్ సరఫా నిలిపివేస్తున్నట్టు ఏపీసీపీడీసీఎల్ ఉయ్యూరు డివిజన్ ఎగ్జిగ్యూటివ్ ఇంజనీరు సీహెచ్ రాంబొట్లు తెలిపారు. కాటూరు చింతలతోట జగనన్న కాలనీకు నూతనంగా లైన్లువేస్తున్నందున సబ్స్టేషన్ పరిధిలో కాటూరు, రాజుపేట, క డవకొల్లు, పొట్లపాడు, వీరవల్లి గ్రామాలలో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

ఆటల పోటీలు

ప్రజాశక్తి-ఉయ్యూరు

స్థానిక శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మంగ ళవారం బాల బాలికలకు మ్యూజికల్ చైర్స్, స్పూన్ లెమన్ పోటీలు నిర్వహించారు. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఈపోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీల్లోగెలుపొందిన వారికి శిబిరం ముగింపు రోజున బహుమతులు అందజేస్తామని గ్రంథా లయ అధికారి బి.రమణి తెలిపారు. విద్యార్థులు శిబిరంలో పాల్గొని వేసవి శెలవులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఉంగుటూరు మండలంలో

జాతీయ డెంగ్యూ దినోత్సవ ర్యాలీలు

ప్రజాశక్తి-ఉంగుటూరు

గత కొన్ని సంవత్సరాలుగా డెంగ్యూ కేసులు అత్యధికంగా నమోదవుతుండటం ఆందోళన కల్గిస్తోందని ఎంపీడీవో శేషగిరిరావు అన్నారు. మంగళవారం ఉంగుటూరులో ర్యాలీ నిర్వహించారు. ఉంగుటూరు మండలం ఇందుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డెంగ్యూ వ్యాధి-నివారణా చర్యలుపై ఏర్పాటుచేసిన సమావేశంలో ఎంపిడిఒ మాట్లాడారు. డాక్టర్ శిరీష మాట్లాడుతూ డెంగ్యూ అనేది వెక్టర్ ద్వారా సంక్రమించే వ్యాధిగా పేర్కొన్నారు. డెంగ్యూ లక్షణాలు సాధారణంగా 3-14 రోజుల మధ్య కన్పిస్తాయన్నారు. అధిక జ్వరం, కండరాలు, కీళ్ల నొప్పులు, నిరంతర తలనొప్పి, కళ్ల వెనుక నొప్పి, శరీరంపై దద్దుర్లు డెంగ్యూ లక్షణాలుగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఇఒ (పిఆర్ అండ్ ఆర్‌డి ఎం.అమీర్ బాష, పంచాయతీ కార్యదర్శి ఎన్.ప్రసాద్, ఎం.పి.హెచ్ఎస్ వై.అంకి రెడ్డి, జయలక్ష్మి, ఎన్.శివరామకృష్ణ, ఎంపిహెచ్ఎ, ఎఎన్ఎంలు, ఆరోగ్య కేంద్రం, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు. **ఉయ్యూరు :** జాతీయ డెంగ్యూ దినోత్సవం పురస్కరించుకుని ఉయ్యూరు అర్బన్ హెల్త్ క్లినిక్ అధ్వర్యంలో మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. నగరపంచాయతీ కార్యాలయం వద్ద ర్యాలీని చైర్మన్ వి. సత్యనారాయణ, కమిషనర్ పి. వెంకటేశ్వరరావు ప్రారంభించారు. మంచినీటిలో పెరిగే దోమ కాటు వల్ల డెంగ్యూ వ్యాధి వ్యాపిస్తుందని ఇంటి పరిసరాల్లో నీరు నిల్లకుండా జాగ్రత్తలు పాటించాలని వైద్య అధికారి తేజస్విని సూచించారు. సబ్‌యూనిట్ అధికారి సర్వారాయుడు, హెల్త్ సూపర్ వైజర్ శ్రీనివాసరావు, సరళ, వార్డు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. కాటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యాన కాటూరులో డెంగ్యూ వ్యాధి అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్య అధికారి డాక్టర్ దీప, ఎంపీహెచ్ సీవోలు పి. నాగార్జున బా బు. రత్నబాబు ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉయ్యూరులో

శతాధిక వృద్ధుడు కోనపరెడ్డి చలపతి మృతి

ప్రజాశక్తి-అవనిగడ్డ

అవనిగడ్డ పంచాయతీ పరిధిలోని కొత్తపేట గ్రామానికి చెందిన శతాధిక వృద్ధుడు కోనప రెడ్డి చలపతి(103) మృతి చెందారు.ఆయన యుటిఎఫ్ మండల శాఖ అధ్యక్షులు జీవేంద్రరావు తండ్రి. చలపతి మృతికి యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు బి.కనకారావు సంతాపం తెలిపారు మంగళవారం జివేంద్రరావు స్వగృహానికి వెళ్ల చలపతి మతదేహంపై పూలదండలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో దివి మండల శాఖ ప్రధాన కార్యదర్శి ఎన్ శ్రీకాంత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

నివాళులర్పిస్తున్న యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు బి.కనకారావు

25వేల మందికి అన్నదానం

ప్రజాశక్తి-అవనిగడ్డ

అవనిగడ్డలో రాజీవ్ సెంటర్‌లోని ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అన్న సమారాధనకు పెద్ద ఎత్తున భక్తులు పోటె త్తారు. మంగళవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల జూనియర్ కళాశాల ప్రాంగణంలో కమిటీ వారు ఏర్పాటు చేసిన 25 వేల మందికి పైగా అన్న సమారాధన జరిగిందని నిర్వాహకులు తెలిపారు.

అన్నదానంలో పాల్గొన్న యాత్రికులు

వంటశాలను పరిశీలించిన చైర్మన్

ప్రజాశక్తి-వన్‌టౌన్: దుర్గగుడికి వచ్చే భక్తులకు అన్నదాన నిమిత్తం అర్జున వీధిలో గల శృంగేరి మఠంలో వంటలను తయారుచేసి కొండపైన గల మహామండపంకు తీసుకువస్తారు. అయితే సోమవారం శృంగేరి మఠంలో వంట చేస్తుండగా ప్రమాదశాత్తు గ్యాస్ లీకై అగ్ని ప్రమాదం చోటుచేసుకున్న నేపథ్యంలో మంగళవారం దుర్గగుడి పాలకమండలి చైర్మన్ కర్నాటి రాంబాబు, పాలకమండలి సభ్యులు శృంగేరి పీఠంలోని వంటశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న గ్యాస్ పైప్ లీక్ జరిగిందని, అయితే అమ్మవారి దయవల్ల ఎవరికి ఎటువంటి హానీ జరగలేదన్నారు. సిబ్బంది అప్రమత్తంతో ప్రమాదం తప్పిందన్నారు. వంటశాలలో చిన్నచిన్న సమస్యలను అధికారుల దష్టికి తీసుకువస్తే, ఆలయ అభివద్ధికి పాలకమండలి నిరంతరం సేవ చేస్తుందని చైర్మన్ రాంబాబు వారికి తెలిపారు. భక్తులకు పాలకమండలి సభ్యులు ఎప్పుడు అందుబాటులో ఉంటారన్నారు. అన్నదానంలో ఉపయోగించే అరిటాకులను మిషన్ ద్వారా ఎరువులకు వేయించే ప్రయత్నం త్వరలోనే చేస్తామని తెలిపారు. మిషను కొనుగోలు చేసేందుకు దాతలు ముందుకు రావాలని కోరారు.

ఫొటో-5-కేంద్ర సహాయ మంత్రి కౌశల్ కిషోర్‌కు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు, పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి

దుర్గమ్మను దర్శించుకున్న కేంద్ర మంత్రి

ప్రజాశక్తి-వన్‌టౌన్: ఇంద్రకీలాద్రి దుర్గమ్మను మంగళవారం కేంద్ర గహ, పట్టణ వ్యవహారాల సహాయ మంత్రి కౌశల్ కిషోర్ దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ కర్నాటి రాంబాబు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారి పంచహారతుల సేవలో పాల్గొన్నారు. అనంతరం పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, ట్రస్ట్ బోర్డు చైర్మన్ అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటం అందజేశారు.

ఫ్రూట్ సలాడ్ పంపిణీ

ప్రజాశక్తి-సింగ్‌నగర్: సిపిఐ 58వ డివిజన్ ఆధ్వర్యంలో మంగళవారం సింగ్‌నగర్ డాబా కోట్లు సెంటర్లో సాయి కృప సూపర్ మార్కెట్ వద్ద ఫ్రూట్ సలాడ్, మజ్జిగ, విసిన కర్రలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నగర సహాయ కార్యదర్శులు లంక దుర్గారావు, నక్క వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ అందజేత

ప్రజాశక్తి-వన్‌టౌన్: మండే ఎండల్లో ప్రజలకు, ప్రయాణికులకు చల్లటి మజ్జిగను ఎన్టీఆర్ జిల్లా టిడిపి వాణిజ్య విభాగం అధ్యక్షులు, జైన్ సమాజ అధ్యక్షులు రాజు సోలంకి ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. మంగళవారం రాజా రంగయ్యప్పారావు రోడ్డులోని భారతి ఎక్స్‌రే సమీపంలో సుమారు 500 మందికి మజ్జిగ పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పిళ్లా సుదర్శన్, జైన్ సమాజ్ మదన్‌లాల్, హీరాచంద్, గౌతమ్, అంకుష్, సురేష్, మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

25న పాత ఫర్నీచర్ వేలం

ప్రజాశక్తి-విజయవాడ: భూగర్భ జల మరియు జల గణన శాఖలో పాత ఫర్నిచర్‌ను ఈ నెల 25వ తేదీన బహిరంగ వేలం వేయనున్నట్లు భూగర్భ జల, జలగణన శాఖ సంచాలకులు జాన్ సత్యరాజు ఒక ప్రకటనలో తెలిపారు. భూగర్భ జల, జలగణన శాఖ విజయవాడ కార్యాలయంలో నిరుపయోగంగా ఉన్న ఇనుప బల్లలు, చెక్క బల్లలు, ఎస్ టైపు కుర్చీలు, రివాల్వింగ్ కుర్చీలు, కుషన్ లెగ్ కుర్చీలు, తపాల రాక్స్, వైర్ కుర్చీలు, కార్ టైర్లు వంటివి మే 25వ తేదీ ఉదయం 11 గంటలకు వేలము వేయడానికి నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. వేలములో పాల్గొన దలచిన వారు వంద రూపాయలు ధరావత్తు సొమ్మును చెల్లించి వేలంలో పాల్గొనాలని, వేలము పొందలేని వారికి ధరావత్తు సొమ్ము తిరిగి చెల్లించబడుతుందన్నారు. వేలము దక్కించుకున్న వారు మొత్తం సొమ్మును చెల్లించి సామానులను పొందవలసి ఉంటుందన్నారు. ఇతర వివరాలకు విజయవాడ భూగర్భ జల, జల గణన శాఖ కార్యాలయం, 9959076075కు సంప్రదించాలని సంచాలకులు జాన్ సత్యరాజు ఆ ప్రకటనలో తెలిపారు.

'హోటల్ మేనేజ్‌మెంట్'తో ఉపాధి అవకాశాలు

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సు చేసిన వారికి దేశ, విదేశాలలో మంచి ఉపాధి అవకాశాలు ఉన్నాయని, విజయవాడ ఆతిథ్య రంగానికి చక్కటి వసతులు ఉన్నాయని చెన్నైస్ అమిర్త సౌత్ జోన్ ప్లేస్‌మెంట్ హెడ్ సతీష్ అన్నారు. ఎం.జి.రోడ్డులోని చెన్నైస్ అమిర్త ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ నందు మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమంలో భాగంగా వివిధ కళాశాలల హెచ్.ఆర్. విభాగాధిపతుల సమావేశం మంగళవారం జరిగింది. ఈ సమావేశాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించిన కిషోర్ మాట్లాడుతూ అతిథ్య రంగాన్ని ఎంచుకున్న వారికి మన దేశంలో పాటు విదేశాలలో కూడా మంచి ఉపాధి అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ముఖ్యంగా ఇటీవల కాలంలో మన దేశంలోని వివిధ ప్రాంతాలలో అంతర్జాతీయ స్థాయి పేరొందిన హోటల్స్ రావడంతో పాటు, పర్యాటక రంగానికి ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు ప్రధాన్యత ఇస్తున్నాయని అన్నారు. దీనితో మన విద్యార్థులతో పాటు ఇతర దేశాల విద్యార్థులు కూడా ఇక్కడకు వచ్చి చదవడంతో పాటు, ఇక్కడ అతిథ్య రంగంలో స్థిరపడుతున్నారని అన్నారు. మన రాష్ట్రం కూడా పర్యాటకరంగా ప్రముఖ ప్రాంతాలను అభివృద్ధి చేస్తుందని దీనితో పర్యాటకులను మన రాష్ట్రం ఆకట్టుకుంటుందని దీనితో ఇక్కడ హోటల్ రంగంలో ప్రవేశించే వారి సంఖ్య పెరుగుతుందన్నారు. ఈ సమావేశంలో నగరంలోని పేరెన్నికగల స్టార్ హోటల్స్ వివాంటా, నోవాటెల్, రాజ్‌భోగ్, మనోరమ, జేడ్‌సూట్స్, డి.వి. మానర్, ఫార్చ్యూన్ మురళి హోటల్, పార్క్ ఎన్ నుండి పెద్ద సంఖ్యలో హెచ్.ఆర్. ప్రొఫెషనల్స్ పాల్గొని విద్యార్థులకు ఆతిథ్య రంగం గురించి తెలియచేశారు. ఈ కార్యక్రమంలో చెన్నైస్ అమిర్త కళాశాల ప్లేస్‌మెంట్ హెడ్ దాసరి నరేష్, విజయవాడ సెంటర్ కళాశాల ప్రిన్సిపాల్ కిషోర్‌రెడ్డి పాల్గొన్నారు.

తూతూమంత్రంగా గంపలగూడెం మండల సమావేశం

ప్రజాశక్తి-గంపలగూడెం: గత మూడు సమావేశాలు నిర్వహించారు కానీ వాటితో గ్రామాలకు ఒరిగిందేమీ లేదని పలువురు సభ్యులు పేర్కొన్నారు. మంగళవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీడీవో వై పి రెడ్డి అధ్యక్షతన జరిగింది. వినగడప నుండి పి ఎస్ సి ఎస్ అధ్యక్షుడు పెమ్మిరాజు ఆంజనేయులు మాట్లాడుతూ, గతంలో తమ గ్రామానికి మూడు లక్షల గ్రాండ్ ఇచ్చినట్టే ఇచ్చి తిరిగి లాగేసుకున్నారని, వాటిని నేటికీ జమ చేయలేదు ఎందుకని అని ప్రశ్నించారు. ప్రస్తుతం మండుతున్న ఎండల్లో మంచినీటికి ప్రజలు ఇబ్బంది పడుతున్నారని గ్రామంలో కనీసం మూడు బోర్లు అయినా వేయించాల్సిన అవసరం ఉందని, మండల పరిషత్తుతో గ్రామాలకు ఒరిగింది ఏంటని ప్రశ్నించారు. ఎంపీడీవో వైపిరెడ్డి పొంతన లేని సమాధానంతో పులిస్టాప్ పెట్టారు. అనంతరం మరో గ్రామానికి చెందిన సర్పంచ్ లేచి గ్రామాల్లో ఇసుక కొరతతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఇతర మండలాల్లో ఉన్న వెసులుబాటు గంపలగూడెం లో ఎందుకు లేదంటూ ప్రశ్నించారు. కాలనీ గహాలకు సైతం ఇసుక మంజూరు చేయకుండా కొందరు తొక్కు పడుతున్నారని, సభలో మాట్లాడారు. ఈ సందర్భంగా హౌసింగ్ ఏ ఈ కిషోర్ మాట్లాడుతూ, ప్రభుత్వం గంపలగూడెంలో గహాలకు స్టాక్ పెడతారని, ఆ పరిస్థితుల్లో లబ్ధిదారులకు అందజేస్తామని తెలిపారు. మొత్తం మీద సమావేశానికి సభ్యులు అరకొరగా హాజరైనప్పటికీ సమావేశం పసలేయకుండా ముగించడం విశేషం. దీనితో వచ్చామా? పోయామా? అన్న చందంగా మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం ముగిసింది. ఎంపీపీ గోగులముడి శ్రీలక్ష్మి, జడ్పిటిసి శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి కంప్యూటర్ బహూకరణ

ప్రజాశక్తి-విజయవాడ: స్థానిక ఠాగూర్ స్మారక గ్రంథాలయానికి కాకాని వెంకటరత్నం మనవడు కాకాని తరుణ్ కంప్యూటర్‌ను బహూకరించారు. మంగళవారం ఆయన గ్రంథాలయానికి విచ్చేసి గ్రంథాలయంలోని ప్రతీ విభాగాన్ని సందర్శించి పాఠకులు, విద్యార్థులతో ముచ్చటించారు. అనంతరం గ్రంథాలయానికి అవసరమైన కంప్యూటర్‌ను ఉమ్మడి కష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ తిప్పరమల్లి జమల పూర్ణమ్మ చేతుల మీదుగా బహూకరించారు. అనంతరం గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరంను సందర్శించారు. విద్యార్థులు చెప్పిన శ్లోకాలకు ముచ్చట పడి నగదు బహుమానాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాదికారిణి కె.రమా దేవి, గ్రేడ్ 3 గ్రంథ పాలకురాలు వై.ధనలక్ష్మి పాల్గొన్నారు.

నవజీవన్ బాలలకు భోజనం ఏర్పాటు

ప్రజాశక్తి-వన్‌టౌన్: స్థానిక కొత్తపేటలోని శ్రీ వేణుగోపాలస్వామివారి దేవస్థానం కమిటీ చైర్మన్ వంజరపు సూర్యారావు మనమరాలు శ్రీదియ పుట్టినరోజు సందర్భంగా మంగళవారం నవజీవన్ బాలభవన్లోని బాలబాలిలకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు. శ్రీదియ తాత వంజరపు సూర్యారావు, రాజ్యలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పుట్టినరోజు జరుపుకున్న శ్రీదియకు అక్కడి బాలబాలికలు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కోరాడ శిరీష తదితరులు పాల్గొన్నారు.

20న ఎపి గురుకుల విద్యాలయాల ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి-భవానీపురం: ఎపి గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో గురుకుల పాఠశాలలు, జూనియర్ కళాశాలలు మరియు డిగ్రీ కళాశాలలో 2023-24 విద్యా సంవత్సరానికి ప్రవేశ పరీక్ష ఈ నెల 20వ తేదీన జరుగుతాయని విజయవాడ భవానీపురం ఐరన్ కాలప్లెక్స్‌లో గల ఏపి రెసిడెన్షియల్ స్కూల్ ప్రిన్సిపాల్ జి.ఎమిలి కాంతం మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మే 20వ తేదీన 5, 6, 7, 8వ తరగతులకు ఉదయం 10 నుండి 12 గంటల వరకూ మరియు కళావాలలకు మధ్యాహ్నం 2.30 నుండి 5 గంటల వరకు రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాలలో నిర్వహించబడుతుందని తెలిపారు. ఈ పరీక్షకు సంబంధించిన అభ్యర్థుల హాల్ టిక్కెట్లు https//aprs.apcfss.in వెబ్ సైట్‌లో ఉంచబడ్డాయని తెలిపారు. ఈనెల 15వ తేదీ నుండి అభ్యర్థులు తమ కాండిడేట్ ఐ డి మరియు పుట్టిన తేదీ ద్వారా వెబ్‌సైట్ నుండి హాల్ టిక్కెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. హాల్ టిక్కెట్లు పోస్ట్ ద్వారా పంపబడవని చెప్పారు. అభ్యర్థులు హాట్ టిక్కెట్లలో తమకు కేటాయించిన పరీక్షా కేంద్రానికి గంట ముందు చేరుకోవాల్సి ఉంటుందన్నారు. వివరాలకు 8978344949 నెంబర్‌కు సంప్రదించాలని తెలిపారు.

అమరావతిని నాశనం చేశారు : పోతిన

ప్రజాశక్తి-వన్‌టౌన్: రాజధాని అమరావతిని జగన్ సర్వనాశనం చేశారని జనసేన పశ్చిమ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పోతిన వెంకట మహేష్ ఘాటుగా విమర్శించారు. మంగళవారం ఇంటింటికి రాబోయే మన జనసేన ప్రభుత్వం 31వ రోజు కార్యక్రమం 37వ డివిజన్ అధ్యక్షులు శిగినంశెట్టి రాము గుప్తా ఆధ్వర్యంలో మాని కొండ వారి వీధి జైన్ టెంపుల్ వద్దనుండి ప్రారంభించి 37వ డివిజన్‌లోని పలు ప్రాంతాలలో పర్యటించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పోతిన మహేష్ మాట్లాడుతు ప్రాంతాల మధ్య, ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేందుకే అమరావతిని సర్వనాశనం చేశారన్నారు. రాజధాని అమరావతి ఏర్పాటు చేసే ప్రక్రియలో లోపాలున్న, అక్రమాలు ఉంటే దానికి సంబంధించిన వ్యక్తులను శిక్షించాలి గాని రాజధానిని శిక్షించకూడదన్నారు. రాజధాని అమరావతిని పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి ఎందుకు వ్యతిరేకిస్తున్నారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు తవ్వా మారుతి, డివిజన్ అధ్యక్షులు కొరగంజి వెంకటరమణ, మల్లెపు విజయలక్ష్మి, రెడ్డిపల్లి గంగాధర్, షేక్ అమిర్ భాష, పొట్నూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

హజ్ యాత్రికులకు సాయంపై హర్షం

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: హజ్ యాత్రకు వెళ్లే హాజీలకు రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహనరెడ్డి ఆర్థిక సహకారం అందించడం అభినందనీయమని హజ్ కమిటీ చైర్మన్ జనాబ్ బద్వేల్ షేక్ గకౌజల్ ఆజమ్ తెలిపారు. ఎం.జి.రోడ్డులోని హజ్ కమిటీ కార్యాలయంలో మంగళవారం ఉదయం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ నుండి హజ్ యాత్రకు వెళ్లే యాత్రికులకు రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి ఆర్థిక సహకారం అందించారన్నారు. సుమారు 1814 మందికి రూ.14,51 కోట్ల రూపాయలు నేరుగా వారి ఖాతాలలోకి ఒకొక్కరికి రూ. 80వేల చొప్పున వేశారని తెలిపారు. ఆర్థిఖ సహకారం అందించి ముఖ్యమంత్రి ముస్లిం మైనార్టీల పక్షపాతి అని నిరూపించుకున్నారని అన్నారు. ఈ సమావేశంలో మైనారిటీ కార్పొరేషన్ అడ్వైజరు హబీబుల్లా, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషణ్ చైర్మన్ ఆసిఫ్, ఆల్ మునీర్ ఫౌండేషన్ నిర్వాహకులు మునీర్ అహ్మద్, మత గురువులు నసీర్ అహ్మద్ ఉమ్రి, ముక్తి హబీబ్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-వన్‌టౌన్: కేంద్ర ప్రభుత్వ హజ్ కమిటీ విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ నుంచి నిర్ణయించిన అధిక టికెట్ రేట్ వలన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముస్లిం సోదరులు ఇబ్బందులు పడకుండా పెద్ద మనసుతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి హజ్ యాత్రికులకు ప్రత్యేక ఆర్థిక సహాయం అందజేయడం పట్ల ఎన్టీఆర్ జిల్లా వక్ఫ్ అధ్యక్షులు షేక్ గౌస్ మొహిద్దీన్ మంగళవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. హైదరాబాద్, బెంగళూరు ఎంబార్కేషన్ ధరలతో సమానంగా విజయవాడ ఎంబార్కేషన్ టికెట్ ధరలను ఖరారు చేశారని అన్నారు. అలాగే వారికి కావలసిన అన్ని సదుపాయాలను కల్పిస్తున్నారని అన్నారు.

ఉపాధి చట్టం పరిరక్షణకు పోరాటం : సిఐటియు

ప్రజాశక్తి-గన్నవరం

ఉపాధి, భూమి సాధనకై వ్యవసాయ కూలీలు పోరాటం చేయాల్సిన అవసరం ఉందని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వై.నరసింహారావు పిలుపునిచ్చారు. మంగళవారం గన్నవరం మండలం బుద్ధవరంలో ఉపాధి,వ్యవసాయ కూలీలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో కూలీలకు ఉపాధి పనులు లేకుండా పోయే పరిస్థితి వచ్చిందన్నారు. భూస్వాముల మాటలు విని ఉపాధి కూలీల పొట్టలు కొట్టే చర్యలను కేంద్రం తీసుకుంటోందని విమర్శించారు. కూలీలకు 200 రోజుల పని దినాలు చూపించడంతోపాటు రోజు వేతనం రూ.600 వచ్చేలా చూడాలని డిమాండ్‌చేశారు. దీనికోసం పోరాటం చేయాలన్నారు. జిల్లాలో నేటికీ సుమారు 75 శాతం మంది ప్రజలు గ్రామాల్లో నివసిస్తున్నారన్నారు. ఇందులో 80 శాతం మంది గ్రామీణ నిరుపేదలుగా వున్నారని ప్రభుత్వ గణాంకాలే చెబుతున్నాయన్నారు. వ్యవసాయ ఆధారిత కూలి పనులు, ప్రభుత్వం వామపక్షాల పుణ్యాన ప్రారంభించిన ఉపాధిహామీ పనులు మీద ఆధారపడి జీవించే వారి సంఖ్య మన గ్రామాల్లో గణనీయంగా ఉందని వివరించారు. వ్యవసాయ కూలీలు అందరూ సంఘటన ఉపాధి పనుల కల్పనతో పాటు భూమి కోసం జరుగుతున్న పోరాటంలో భాగస్వాములు కావాలన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు మల్లంపల్లి ఆంజనేయులు మాట్లాడుతూ గుడివాడ రూరల్, నందివాడ, గుడ్లవల్లేరు, బంటుమిల్లి, కత్తివెన్ను, బందరు రూరల్, కోడూరు, నాగాయలంక మండలాల్లో చేపలు,రొయ్యల అక్రమసాగు విపరీతంగా పెరిగిందన్నారు. వేల ఎకరాలు అసైన్డ్ భూములూ, సముద్రతీర బంజర్లు పెద్దల చేతుల్లోకి వెళ్ళిపోయాయన్నారు. యనమలకుదురు నుండి మోపిదేవి మండలం వరకు వున్న లంకల్లో వేల ఎకరాలు భూకామందుల చేతుల్లో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో బుద్ధవరం మాజీ సర్పంచ్ గండికోట దశరథ రామయ్య, నక్కా రామారావు, మహిళలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వై.నరసింహారావు

29న కలెక్టరేట్ ఎదుట ధర్నా

ఉయ్యూరు : ఉపాధి కార్మికులకు ఏడాదికి 200 రోజుల పని దినాలు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ రఘు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఉపాధి కార్మికుల సమస్యలు పరిష్కారానికై ఈనెల 29వ తేదీన మచిలీపట్నం కలెక్టర్ ఆఫీస్ ముందు ధర్నాకు పిలుపునిచ్చామన్నారు. ఉయ్యూరు మండల పరిధిలోనే పెద ఓగిరాల గ్రామంలో ఉపాధి కార్మికులతో జరిగిన జనరల్ బాడీ సమావేశంలో రఘు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం దశలవారీగా ఉపాధి హామీ చట్టాన్ని ఎత్తివేయాలని చూస్తోందని విమర్శించారు. కేంద్రప్రభుత్వ తీరును నిరశిస్తూ జరిగే పోరాటాల్లో కూలీలు పాల్గొనాలని కోరారు. ఈకార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మాదాల వెంకటేశ్వరరావు, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు బి రాజేష్, ఉపాధి మేట్లు రమణ, వెంకటేశ్వరరావు, సతీష్ నాయక్, సీత, భవాని, తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆర్.రఘు, పక్కన మాదల వెంకటేశ్వరరావు

ఐసిఇయు ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక ఎల్ఐసి డివిజనల్ కార్యాలయం వద్ద వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని మజ్జిగ పంపిణీని ప్రారంభించారు.

మజ్జిగ పంపిణీని ప్రారంభిస్తున్న డాక్టర్ జి.సుధాకర్ తదితరులు

కొన్ని రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాన్ని ఎల్ఐసి సీనియర్ డివిజనల్ మేనేజర్ డాక్టర్ జి.సుధాకర్ బాబు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రార్థించే పెదవుల కన్నా, సాయంచేసే చేతులు మిన్న అన్న సూక్తిని నిజం చేస్తూ, యూనియన్ నిర్వహిస్తున్న కార్యక్రమం ప్రజోపయోగమైనదని అభినందించారు. ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి జి.కిషోర్ కుమార్ మాట్లాడుతూ సామాజిక బాధ్యత కలిగిన ఉద్యోగ సంఘంగా ప్రజోపయోగ కార్యక్రమాలని నిరంతరం నిర్వహిస్తామని వివరించారు. దీనిలో భాగంగానే వేసవికాలంలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలను దష్టిలో ఉంచుకుని వివిధ పనులపై రహదారిపై తిరిగే ప్రజానికానికి ఉపశమనం కల్గించేందుకు తమవంతు సహకారంగా మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. సుమారు 1200 గ్లాసుల మజ్జిగను ప్రజలకు పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిఇయు నాయకులు జె.సుధాకర్, టి.చంద్రపాల్, వి.ఆర్.ఎన్. ఠాగూర్, బి.శ్రీనివాస్, ఎస్.వి. రత్నారావు, ఎ.శ్రీనివాసరావు, బిహెచ్.మాధుర్, వివిధ విభాగాల ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

1600 మంది లబ్ధిదారుల తొలగింపు దారుణం : రావి

ప్రజాశక్తి-గుడివాడ

టిడిపి హయాంలో ఎంపిక చేసిన లబ్ధిదారుల్లో అన్యాయంగా 1600 మందిని తొలగించి వైసీపీకి చెందిన వారికి కేటాయించడం దారుణమని మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు ఆగ్రహం వ్యక్తంచేశారు. మంగళవారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణంలో టిడ్కో గృహాలు కోల్పోయిన 1600 మంది లబ్ధిదారులకు న్యాయం జరగకపోతే ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సభను అడ్డుకుంటామన్నారు. టిడిపి హయాంలో 80 శాతం పూర్తయిన గృహాలను నాలుగేళ్ల గడుస్తున్నా వైసిపి ప్రభుత్వం లబ్ధిదారులకు అందించకపోవడం దారుణమన్నారు. ఉన్న లబ్ధిదారులను తొలగించి వైకాపాకు చెందిన వారికి కేటాయించినా అధికారులు పట్టించుకోకుండా చోద్యం చూస్తుండటం సరికాదన్నారు. ఈ సమావేశంలో పట్టణ, రూరల్ మండల అధ్యక్షులు దింట్యాల రాంబాబు, వాసే మురళీ, నాయకులు పంద్రాజు సాంబయ్య, పొలాసి ఉమా, శొంఠి రామకృష్ణ, జబీన్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలను వెంటనే ప్రారంభించాలి : ఎంపిడిఒ

ప్రజాశక్తి-గుడివాడ

గుడివాడ రూరల్ మండలం బొమ్ములూరు గ్రామంలో నవరత్నాలు పేదలందరికీ ఇల్లు కార్యక్రమంలో భాగంగా హౌసింగ్ శాంక్షన్ పొందిన లబ్ధిదారుల వెంటనే నిర్మాణలు చేపట్టాలని ఎంపీడీవో వెంకటరమణ కోరారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఇ అట్లూరి వెంకటేశ్వరరావుతో కలసి ఎంపిడిఒ వెంకటరమణ క్షేత్రస్థాయిలో మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మట్లాడుతూ ఇంటి నిర్మాణాలు ప్రారంభించని లబ్ధిదారులు వెంటనే గ్రౌండింగ్ చేసే విధంగా, బేస్మెంట్ వేసిన లబ్ధిదారులు వెంటనే రూఫ్ లెవెల్, వేసే విధంగా చర్యలు తీసుకోవాల్సిందిగా అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం డి.సాంబశివరావు, హౌసింగ్ ఇంఛార్జి ఎఇ డి.పృథ్వీ, పంచాయతీ కార్యదర్శి తాతారావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బియ్యాన్ని అందజేస్తున్న చంద్రశేఖర్

బియ్యం వితరణ

ప్రజాశక్తి-చల్లపల్లి

పాగోలు మాజీ ఉప సర్పంచ్ పసుపులేటి మోహన్ చంద్రశేఖర్ తన తండ్రి రాధాకృష్ణయ్య జ్ఞాపకార్థం స్థానిక సీయోను వృద్ధాశ్రమంలో 25 కిలోల బియ్యం మంగళవారం వితరణగా అందచేశారు. ఈ కార్యక్రమంలో పల్నాటి రాజబాబు, నడకుదురు లీలాబ్రహ్మేంద్ర, ఆశ్రమ నిర్వాహకులు శీలం భాస్కరరావు పాల్గొన్నారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

గన్నవరం మండల వైద్యాధికారి డాక్టర్ కె.సంధ్య

ప్రజాశక్తి-గన్నవరం

అధిక ఎండలో ఎక్కువ సేపు తిరిగితే వడ దెబ్బకు గురై ఆసుపత్రిలో చేరే పరిస్థితులు దాపురిస్తాయని గన్నవరం మండల వైద్యాధికారి డాక్టర్ కె.సంధ్య చెప్పారు. ఆమె ప్రజాశక్తికి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆమె వివరించారు. వివరాలు ఆమె మాటల్లోనే...ఎండల్లో ఎక్కువ సేపు తిరగడం వల్ల తల తిరగడం, నీరసం, తలనొప్పి, వికారం, గుండెవేగంగా కొట్టుకుంటుంది. ఏమి జరుగుతోందో తెలియని స్థితి ఉండటం వడ దెబ్బ తగిలిన వ్యక్తికి వచ్చే లక్షణాలు. వడదెబ్బ తగిలినట్లుగా భావిస్తే వెంటనే నీడ పట్టుకు వెళ్లి పోవాలి. నీరు తాగాలి. ఆలస్యం చేస్తే ప్రాణానికే ప్రమాదం ఉంటుంది. నీడపట్టుకు వెళ్లినా లక్షణాలు తగ్గకపోతే అంబులెన్సుకు ఫోన్ చెయ్యాలి. వైద్య సాయం పొందాలి. వడ దెబ్బ తగలకుండా ఉండాలంటే నీరు బాగా తాగాలి. దాహం వేయక పోయినా అప్పుడప్పుడు నీరు తాగుతూ ఉండాలి. మద్యం తీసుకొంటే వంట్లోని నీరు తగ్గిపోతుంది. వ్యక్తి నిర్జలీకరణానికి గురౌతాడు. ఆల్కహాల్ వల్ల రక్త నాళాలు వ్యాకోచించి చర్మానికి రక్త ప్రసారం పెరుగుతుంది. దీనితో చెమటలు పడుతాయి. ఇది డేంజర్. మద్యం వల్ల సన్ సేన్సిటివిటి పెరిగిపోతుంది. ఎండాకాలంలో పగటి పూట మద్యం తాగడం, తాగి ఎండలోకి వెళ్లడం చేయకూడదు. వీలైనంత వరకు ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ ఎండలోకి వెళ్లకుండా ఉండాలి. తప్పని సరిగా వెళ్ళాలి వస్తే అప్పుడప్పుడు నీడ ప్రాంతానికి వెళ్లి బ్రేక్ తీసుకోవాలి. హైదరాబాద్ మినహాయిస్తే రెండు తెలుగు రాష్ట్రాల్లోని చాలా ప్రాంతాల్లో గాలిలో తేమ ఎక్కువ. దీనివల్ల ఎండాలంలో చెమటలు బాగా పడుతాయి. మజ్జిగ , కొబ్బరి నీరు లాంటివి తరచూ తీసుకోవడం, వదులుగా ఉన్న నూలు దుస్తులు ధరించడం, రోజుకు రెండు,మూడుసార్లు స్నానం వంటివి ఉపశమన మార్గాలు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఇవీ..

ఎండ నుంచి ఇంట్లోకి వచ్చిన వెంటనే చన్నీటితో స్నానం చేయకూడదు. కనీసం ఐదు నిముషాలు గాప్ ఇవ్వాలి. ఫ్యాన్ కింద లేదా ఏసీలో కూర్చుని పది నిముషాల తరువాత చన్నీటి స్నానం చేసుకొంటే మంచిది. ఎండలో ఉన్నప్పుడు వడ దెబ్బ తగలకుండా ఉండేదుకు తలపై నీరు పోసుకోవచ్చు. కీర, సొర, బీరకాయ లాంటి కాయగూరల్లో నీటి శాతం ఎక్కువ. ఇలాంటి వాటిని ఎక్కువగా తీసుకోవాలి. ముఖ్యంగా కీరను ప్రతిపూటా తీసుకుంటే మంచిది. ఊబకాయం వున్నవారికి వడ దెబ్బ తగిలే అవకాశం ఎక్కువ. వీరు తప్పని సరిగా జాగ్రత్తలు తీసుకోవాలి. గత మూడు రోజులుగా ఉష్ణోగ్రత 45 డిగ్రీలు దాటి 50 డిగ్రీల వరకు చేరే ప్రమాదం ఉంది.

మహిళల రక్షణకు ప్రాధాన్యత : జాషువా

ప్రజాశక్తి - మచిలీపట్నం అర్బన్

మహిళల భద్రత, రక్షణకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని దిశ డిఎస్పీకి జిల్లా ఎస్పీ పి.జాషువా సూచించారు. దిశ మహిళా పోలీస్ స్టేషన్ డిఎస్పీ ఉప్పుటూరి నాగరాజు మంగళవారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీను మర్యాద పూర్వకంగా కలిశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా ఒంగోలు డిఎస్పీగా పని చేస్తూ బదిలీపై జిల్లా దిశ మహిళా పోలీస్ స్టేషన్ డిఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర డీజీపీ కె వి రాజేంద్రనాథ్ రెడ్డి ఆదేశాల మేరకు మహిళల భద్రత, రక్షణకు మొదటి ప్రాధాన్యత నివ్వాలన్నారు. మహిళలపై జరిగే నేరాలను నివారించటంలో బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తూ, చిన్న గొడవలతో స్టేషనుకు వచ్చే బాధితులను, ప్రతివాదులకు కౌన్సిలింగ్ నిర్వహించాలని కోరారు.

ఎస్‌పి జాషువాను కలిసిన నాగరాజు

పఠనా నైపుణ్యాలపై శిక్షణ

ప్రజాశక్తి-పెదపారుపూడి

వేసవి శిక్షణా తరగతుల్లో భాగంగా మండల కేంద్రమైన పెదపారుపూడి శాఖా గ్రంథాలయంలో మంగళవారం గ్రంథ పాలకురాలు ఎంవిఎస్ లక్ష్మి ఆధ్వర్యంలో విద్యార్థులకు విద్యార్థులం-వంనా నైపుణ్యాలుపై అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. లక్ష్మి మాట్లాడుతూ వేగంగా చదవడం అలవాటు చేసుకుంటే తక్కువ సమయంలో ఎక్కువ విషయాలను నేర్చుకునే అవకాశం ఉంటుందన్నారు. విద్యార్థులు చేత వివిధ రకాల పుస్తకాలను చదివించారు. ఈ కార్యక్రమంలో మదన్, వాలంటీర్లు, విద్యార్థులు, గ్రంథాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిర్ణీత గడువులోగా పరిశ్రమల స్థాపన దరఖాస్తుల పరిష్కారం

కలెక్టర్ డిల్లీరావు

ప్రజాశక్తి - విజయవాడ : పరిశ్రమల స్థాపనకు సింగల్ డెస్క్ పోర్టల్ ద్వారా సమర్పించే దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. డిస్ట్రిక్ట్ ఇండస్ట్రియల్ అండ్ ఎక్స్ పోర్ట్ ప్రమోషన్ కమిటీ (డిఐఇపిసి) కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుండి మంగళవారం కమిటీ ఛైర్మన్, జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీరావు సంబంధిత అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పరిశ్రమలను స్థాపించడం ద్వారా నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు లభించడంతో పాటు ఆర్థికాభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. త్వరితగతిన అనుమతులు మంజూరు చేసే సింగల్ విండో ద్వారా ఇప్పటివరకు జిల్లాలో పరిశ్రమలను స్థాపించేందుకు 282 ధరఖాస్తులు రావడం జరిగిందని వీటిలో నిర్ధేశించిన గడువులోగా పరిష్కరించవలసిన 11 ధరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. పర్యావరణ పరిరక్షణ శాఖకు సంబంధించి 8 ధరఖాస్తులు, కర్మాగారాల శాఖకు సంబంధించి మూడు ధరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. షెడ్యూల్ కులాలు, తెగలు, మహిళా పారిశ్రమిక వేత్తలను ప్రోత్సహించేందుకు నిర్ధేశించిన స్టాండ్ ఆప్ ఇండియా పథకంలో మరింత మంది పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించవలసి ఉందని దీనిపై పూర్తి స్థాయిలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి సమీక్షించాలన్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా అనదికారకంగా నిర్వహిస్తున్న ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్ ప్లాంట్ల పై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పాలసీలను పూర్తి స్థాయిలో చర్చించేందుకు ఆర్‌డబ్ల్యుఎస్, లీగల్ మెట్రాలజీ, ఫుడ్‌సేఫ్టీ, నగరపాలక సంస్థ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్ అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించాలని కలెక్టర్ డిల్లీరావు అన్నారు. పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించేందుకు ఇండస్ట్రియల్ డవలప్‌మెంట్ పాలసీ (ఐడిపి)- 2015 -20, 2020-23, వైఎస్సార్ జగనన్న బడుగు వికాసం పథకాలలో బాగంగా జనరల్, ఎస్సీ, ఎస్టీ పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించేందుకు 4 కోట్ల 29 లక్షల 55 వేల 516 రూపాయల పెట్టుబడి రాయితి, పావలా వడ్డీ, విద్యుత్ సబ్సిడీ, ప్రోత్సహకాలను ఆమోదించడం జరిగిందని జిల్లా కలెక్టర్ డిల్లీరావు అన్నారు. ఈజూమ్ కాన్ఫరెన్స్‌లో మెంబర్ కన్వీనర్ జిల్లా పరిశ్రమల అధికారి వై వీర శేఖర్, ఏపిఐఐసీ జోనల్ మేనేజర్ కె. ఎస్ ఎస్ సీతారాం, కాలుష్య నియంత్రణ మండలి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టి. ప్రసాదరావు, డిప్యూటీ కమర్షియల్ టాక్స్ ఆఫీసర్లు టి. నాగప్రసాద్, పి శ్రీనివాస్‌బాబు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

22 నుండి నిరసనలకు ఎపిజిఎ పిలుపు

ప్రజాశక్తి - విజయవాడ : ఎన్టీఆర్ జిల్లా, పట్టణ ఏపీజిఏ కార్యవర్గ సమావేశం మంగళవారం విజయవాడలోని జిల్లా కార్యాలయంలో జరిగింది. ఈసమావేశానికి రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కే సూర్యనారాయణ, జి.ఆస్కారావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఏపీజిఏ సంఘం ప్రతిపాదించిన ఉద్యమ కార్యాచరణ ప్రణాళికపై ఈ సమావేశంలో చర్చించారు. జిల్లాలోని తాలూకా యూనిట్ సభ్యులు, విజయవాడ నగర, జిల్లా కార్యవర్గ సభ్యులు ఈనెల 22 నుండి జూన్ 5వ తేదీ వరకు కార్యక్రమాల ద్వారా తమ నిరసన తెలియజేయాలని పిలుపునిచ్చారు.

నిబంధనలు అతిక్రమించిన వారికి జరిమానా

ప్రజాశక్తి - విజయవాడ : కార్పొరేషన్ కోర్టు న్యాయమూర్తి వి.విజయ్ కుమార్ రెడ్డి మంగళవారం నగరంలోని సర్కిల్-1 కార్యాలయంలో మొబైల్ కోర్టును నిర్వహించారు. శానిటరీ సూపర్వైజర్లు, శానిటరీ ఇన్స్పెక్టర్లు మున్సిపల్ కార్పొరేషన్ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన వారిపై 20 కేసులు నమోదు చేసి వారిని న్యాయమూర్తి ముందు హాజరుపరిచారు. వీటిలో ట్రేడ్ లైసెన్స్ లేకుండా వ్యాపారం నిర్వహింస్తున్న వ్యక్తులను, విచ్చలవిడిగా పశువులను రోడ్ల పైకి వదిలివేసే వ్యక్తులను, రోడ్ల పైన చెత్త వేసే వారిని నేరాల కింద వారికి న్యాయమూర్తి రూ.9,020 జరిమానాను విధించారు. మరోసారి ఈ విధంగా నిబంధనలకు విరుద్ధంగా చేస్తే చట్ట ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని వారిని హెచ్చరించారు. అనంతరం న్యాయమూర్తి వారికి కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈకార్యక్రమంలో జోనల్ కమిషనర్-1, హెల్త్ ఆఫీసర్లు, శానిటరీ సూపర్వైజర్లు, శానిటరీ ఇన్స్ పెక్టర్లు, శానిటరీ సెక్రెటరీలు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత ఎంతో అవసరం

కలెక్టర్ డిల్లీరావు, విఎంసి కమిషనర్ దినకర్

ప్రజాశక్తి - అజిత్‌సింగ్‌నగర : జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం 60వ డివిజన్ వాంబే కాలనీలోని నగరపాలక సంస్థ వాంబే కాలనీ కళ్యాణ మండపంలో జాతీయ కీటక జనిత వ్యాధి నియంత్రణపై అవగాహనా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ఎస్.డిల్లీరావు మాట్లాడుతూ డెంగ్యూ వ్యాధిపై ప్రతి ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలన్నారు. ముఖ్యంగా వధా నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, వాడిన టైర్లు, పనికి రాని వస్తువులు, వాడిన కొబ్బరి బొండాలు, చిప్పలు తదితర వాటిలో నీరు నిల్వ ఉండి దోమలు వ్యాప్తి చెందే ప్రమాదం ఉందన్నారు. సెంట్రల్ ఎంఎల్ఏ మల్లాది విష్ణు మాట్లాడుతూ డెంగ్యూ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండి వ్యాధి నివారణకు అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. నీటి ట్యాంకులపై మూతలు ఉంచాలని, మురుగునీరు, ఎక్కువగా ఉన్న ప్రదేశాలలో ఫాగింగ్, ఆయల్బాల్స్ వెదజల్లడం, వంటి చర్యల ద్వారా లార్వా వ్యాప్తి చెందకుండా నివారించవచ్చునన్నారు. దోమలు కుట్టకుండా దోమ తెరలు వాడడం ద్వారా రక్షణ పొందవచ్చన్నారు. నీటి ప్రవాహం సక్రమముగా లేని మేజర్ డ్రెయిన్, ప్రధాన కాల్వ అంచుల వెంబడి మలేరియ సిబ్బంది ద్వారా యం.ఎల్ ఆయిల్ స్ప్రేయింగ్ నిర్వహించినట్లు తెలిపారు. సిబ్బంది వెళ్లేందుకు అవకాశం లేని చోట్ల కూడా యం.ఎల్. ఆయిల్ స్ప్రే చేయడం, మురికిగుంటలలో డ్రోన్ సహకారంతో యం.ఎల్ ఆయిల్ స్ప్రేయింగ్ చేస్తున్నామని తెలిపారు. విఎంసి కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ డెంగ్యూ వ్యాధి ఆడ ఈడిసీజ్ దోమకాటుతో వైరస్ ద్వారా వ్యాప్తి చెందుతుందన్నారు. హఠాత్తుగా వచ్చే తీవ్రమైన జ్వరం, తలనొప్పి, కండరాలు, కీళ్ళనొప్పులు, ఆకలి మందగించడం, వాంతులు, చర్మంపై దద్దుర్లు వంటివి డెంగ్యూ వ్యాధి లక్షణాలుగా గుర్తించవచ్చునన్నారు. ఈ దోమలు పగటిపూట ఇంటి లోపల ఆవరణలో సంచరించి కుట్టడం జరుగుతుందన్నారు. వీటి నివారణకు దోమలు వ్యాప్తి చెందకుండా అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డెంగీ వ్యాధి నుండి రక్షణ పొందేందుకు అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకుని ప్రజల భాగస్వామ్యంతో దోమలను నివారించుకుని వ్యాధి నుండి రక్షణ పొందాలని కమీషనర్ అన్నారు. అనంతరం కలెక్టర్ ఢిల్లీరావు, కమిషనర్ దినకర్, జాతీయ కీటక జనిత వ్యాధి నియంత్రణా డెంగ్యూ వ్యాధిపై ప్రచార గోడ పత్రికలను ప్రతి ఇంటికి అంటించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ అవుతు శైలజ రెడ్డి, స్థానిక కార్పొరేటర్ కంచి దుర్గ, కార్పొరేటర్ మొహమ్మద్ షహీనా సుల్తానా, డియం హెచ్ డా. యం.సుహాసిని, ఇన్చార్జ డియంవో నరసింహా నాయక్, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డా.పి.రత్నావళి బయాలజిస్ట్ సూర్యకుమార్ పాల్గొన్నారు.అలాగే అభివద్ధి చెందుతున్న సింగ్ నగర్ ఎక్సెల్ ప్లాంట్‌ను జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు, విఎంసి కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈపర్యటనలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, శానిటరీ ఇన్స్‌పెక్టర్లు పాల్గొన్నారు.

మొదటిపేజీ తరువాయి

నిప్పుల కొలిమి

చలివేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజల దాహార్తిని తీర్చుతున్నాయి. మజ్జిగ పంపిణీ చేస్తున్నాయి. ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే వారు, ఫుడ్ డెలివరీ బాయ్స్, బస్సు, లారీ డ్రైవర్లు, ప్రయాణీకులు వడ దెబ్బకు గురవ్వకుండా రక్షించుకునేందుకు ముఖాలకు కర్చీఫ్‌లు కట్టుకుంటున్నారు. రోడ్లపై మహిళలు ఎక్కువగా గొడుగులు వాడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కూరగాయల కోత, మొక్కజొన్న , మినుము కాటాలు, ట్రాన్స్‌పోర్టు తదితర పనులను 10 గంటల లోపే ముగించుకుని తిరిగి ఇళ్ళకు చేరుకుంటున్నారు. తీవ్ర ఎండల నేపథ్యంలో శీతలపానీయాలు, ఐస్‌క్రీమ్‌లు, ఫ్రూట్ జూస్‌లు, కొబ్బరి బొండాలకు గిరాకీ పెరిగింది. ఎండ వేడికి భయపడి సంబంధిత ఆహార పదార్థాల కోసం ఆన్‌లైన్ యాప్‌ల్లోనే ఆర్డర్ పెడుతున్నారు. మంగళవారం కృష్ణాజిల్లాలోని 25 మండలాల్లో అత్యధిక ఉషోగ్రతలు నమోదయ్యాయి. మొవ్వ మండలం కాజలో అత్యధికంగా 44.59 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

అత్యధికంగా కంచికచర్లలో 48 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

విలవిల్లాడిపోయారు. మధ్యాహ్నం 12 గంటలకు 46 డిగ్రీలు, 1 గంటకు 47 డిగ్రీలు, 2 గంటలకు 48 డిగ్రీలు ఉష్ణోగ్రత నమోదైంది. సాయంత్రం 4 గంటలు దాటినా ఎండతోపాటు వడగాలుల తీవ్రత కూడా తగ్గలేదు. ఎండ తీవ్రతకు జనం బయటకు రావటానికి ఇబ్బందిపడ్డారు. ఒంటి గంట నుండి 3 గంటల వరకు జనం బయటకు రాకపోవటంతో ప్రధాన వీధులు నిర్మానుష్యంగా మారాయి. ఎండ తీవ్రతకుతోడు వడగాలులు, ఉక్కపోతకు చిన్న పిల్లలు, వద్ధులు అల్లాడిపోయారు. ఎండ తీవ్రతతో తలనొప్పి, వాంతులు, విరోచనాలు తదితర రోగాల బారిన పడి జనం ఆస్పత్రుల పాలవుతున్నారు. రాత్రి 7 గంటలు దాటినా వేడిమి తగ్గలేదు. ఫ్యాన్ ఆడకపోతే ఉక్కపోత, ఫ్యాన్ వేస్తే వడగాలికి ఉండలేకపోతున్నట్లు జనం వాపోతున్నారు. ఎండ తీవ్రత నేపత్యంలో మంచినీరు, శీతలపానీయాలు, కొబ్బరి నీళ్లు, తాటిముంజలకు గిరాకీ పెరిగింది.

21న అన్నమయ్య గ్రంథాలయ సందర్శన యాత్ర

తెలిపారు. ఈకార్యక్రమంలో అన్నమయ్య గ్రంథాలయం వ్యవస్థాపకులు లంకా సూర్యనారాయణతోపాటు రాష్ట్రంలోని పలువురు కవులు, రచయితలు పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ యాత్రలో పాల్గొనదలచినవారు సెల్ నెంబరు 9247475975కు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. వారికి ఉచిత భోజన ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. జాతి ఔన్నత్యాన్ని తెలియజేసే ఈ యాత్రకు అందరూ సహకరించాలని వారు కోరారు.

కమిటీల ఏర్పాటుపై నిర్లక్ష్యం

గత జనవరితోనే పూర్తి కాగా, గత నెల 27న జరిగిన కౌన్సిల్ సమావేశంలో ప్రత్యేక కమిటీల ఏర్పాటు చేయాలనే అంశాన్ని ఆమోదించడం గమనార్హం. ఈ అంశాన్ని ఆమోదించి 20 రోజులు గడిచినా నేటికీ నూతన కమిటీలను ఏర్పాటు చేయకపోవడం పట్ల విపక్షాల నుంచి తీవ్రమైన విమర్శలు వినిపిస్తున్నాయి.

11 ప్రత్యేక కమిటీలు

నగరపాలక సంస్థలో 11 ప్రత్యేక కమిటీలుంటాయి. ఒక్కో కమిటీలో 10 మంది సభ్యుల (కార్పొరేటర్లు)తోపాటు ఒక కోఆప్షన్ సభ్యుడు ఉంటారు. కమిటీకి ఛైర్మన్, వైస్ ఛైర్మన్ నేతృత్వం వహిస్తారు. ఆర్థిక, ఆడిట్, మంచినీరు, డ్రైనేజి, రోడ్లు, భవనాలు, బ్రిడ్జిల నిర్మాణాలు, వాటి పర్యవేక్షణ, విద్యా సాంస్కృతికం, ట్రాఫిక్, స్పోర్ట్స్ కమిటీ, లైటింగ్, పార్కుల కమిటీ, మురికివాడల అభివృద్ధి, మహిళాభ్యుదయం, ప్రజాఫిర్యాదులకు సంబంధించి కమిటీలు పని చేస్తుంటాయి. ఎంతో ప్రాధాన్యత కలిగిన ఈ కమిటీలకు విధులు, నిధులను కేటాయించకుండా వీటిని అలంకారప్రాయంగానే ఉంటాయనే స్థాయికి దిగజార్చారనే చర్చ జరుగుతోంది. ప్రస్తుతం ఉన్న స్టాండింగ్ కమిటీ సభ్యుల కాల పరిమితి కూడా జూన్ 1వ తేదీకి ముగుస్తుంది. ఈ కమిటీ చివరి సమావేశం కార్పొరేటర్లు టూర్‌కు వెళ్లే ముందుగా ఈ నెలలోనే ఏర్పాటు చేయాలి. నూతన సభ్యులతో కమిటీని వెంటనే ఏర్పాటు చేయాల్సి ఉంది. కానీ వచ్చే నెల 14వ తేదీ వరకు కార్పొరేటర్లు టూర్‌లోనే ఉంటారు. దీంతో ఆర్థిక పరమైన, ఇతర అవసరమైన నిర్ణయాలు ఈలోపు చేయడానికి అవకాశం లేకుండా పోతుంది.

బిజెపితో కలిసే పార్టీల అడ్రస్ గల్లంతు

సామ్రాజ్యవాద ప్రయోజనాల కోసం ఆ దేశానికి దాసోహం అంటోందన్నారు. వికెసి పార్టీ రాష్ట్ర అధ్యక్షులు జె.ఎన్.విద్యాసాగర్ మాట్లాడుతూ భారత రాజ్యాంగ మౌలిక లక్షణమైన శాస్త్రీయ దక్పథాన్ని మరుగున పరుస్తున్న నూతన జాతీయ విద్యా విధానాన్ని వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. ఉయ్యూరు ప్రధాన సెంటరులో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని, తోట్లవల్లూరు మండలం పాములలంక గ్రామ ప్రజలకు అత్యంత అవసరమైన వంతెనను వెంటనే నిర్మించాలని, రాష్ట్ర ప్రజలకు ప్రత్యేకమైన రాజకీయ వేదికగా రాజ్యాంగ మౌలిక సూత్రాల పరిరక్షణకు, ప్రజాస్వామ్య పరిరక్షణకు పని చేసే అన్ని రాజకీయ పక్షాలు ఉమ్మడి ప్రణాళికతో క్షేమాంధ్ర ప్రజాఫ్రంట్ రూపంలో పనిచేయాలని సదస్సు తీర్మానించింది. ఈ సదస్సులో వివిధ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు చిగురుపాటి భాస్కరరావు, కోసూరు శివ నాగేంద్రం, బి.రాజేష్, బి.కీర్తి, శీలం ప్రకాశరావు, కంభం ప్రభుదాసు, కొండబాబు, ఇస్మాయిల్, ఎ సుబ్బారావు పాల్గొన్నారు.

అంబేద్కర్ స్మృతివనం పనుల ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - విజయవాడ : నగరంలోని పిడబ్ల్యూడి గ్రౌండ్స్‌లో చేపట్టిన అంబేద్కర్ స్మతి వనం పనులను సోమవారం రాత్రి 11 గంటలకు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ శ్రీలక్ష్మి, విజయవాడ మున్సిపల్ కమిషనర్ స్వప్న ల్ దినకర్ పుండ్కర్ ఆకస్మికంగా నతిఖీ చేశారు.

వేలం ప్రకటన
మహారాజశ్రీ అవనిగడ్డ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి వారి కోర్టులో
ఇ.పి. 3/19 ఇన్ ఓ.యస్.నెం. 209/16
బిట్వీన్ :
మేకా వెంకటేశ్వరరావు ... డిహెచ్‌ఆర్
అండ్
అంబటి శ్రీనివాసరావు ... జెడిఆర్
పై నెంబరు ఇ.పి. డిక్రీ బాకీ తీర్మానం నిమిత్తం జెడిఆర్ సంపూర్ణ స్వాధీన హక్కు భుక్తములలో వున్నటువంటి ఈ దిగువ షెడ్యూలు ఆస్థిని పై కోర్టువారి ఎదుట ది.16-6-2023న బహిరంగ వేలం నిర్వహించబడును. కావున ఆసక్తిగల వారు ఉదయం 10-30 గం.ల నుండి వేలంలో పాల్గొని పాడుకొనవచ్చును.
షెడ్యూలు
కృష్ణాజిల్లా, చల్లపల్లి / మొవ్వ సబ్ రిజిస్ట్రార్ వారి ఇలాకా మోపిదేవి మండలం, పెదకళ్లేపల్లి లోని ఆర్.ఎస్. 238/2లో య.0-60 సెంట్లుకి మాగాణి భూమికి హద్దులు.
తూర్పు : జి.రాజారావు భూమి
దక్షిణం : గోళ్ల వెంకటేశ్వరరావు భూమి,
పడమర : ఆర్.మల్లిఖార్జునరావు భూమి
ఉత్తరం : అంబటి విజయలక్ష్మి భూమి
(శ్రీ కోర్టువారి అనుమతితో)
అవనిగడ్డ
ది.15-5-2023 ఇట్లు
మత్తి వెంకటేశ్వరరావు, ఎం.ఎ., బి.ఎల్.,
డిహెచ్‌ఆర్ తరపు న్యాయవాది.

'జగనన్నకు చెబుదాం'ను ప్రజల్లోకి తీసుకెళ్లాలి : కలెక్టర్

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ఉద్యమ స్ఫూర్తితో ముందుకు తీసుకెళ్లాలని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు అధికారులను ఆదేశించారు.సంయుక్త కలెక్టర్ డాక్టర్ అపరాజిత సింగ్, డిఆర్ఓ ఎం.వెంకటేశ్వర్లు, జిల్లా అధికారులు, క్షేత్రాధికారులతో జిల్లా కలెక్టర్ మంగళవారం టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. జగనన్నకి చెబుదాం, స్పందన, ధాన్యం సేకరణ చెల్లింపులు, రీ సర్వే తదితర అంశాలపై సమీక్షించారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమం అమలుపై గుడివాడ ఆర్‌డిఒ పద్మావతి తో పాటు కొందరు తహశీల్దార్ల అభిప్రాయాలను కూడా జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. సోమవారం మండల స్థాయిలో ప్రాజెక్టు మానిటరింగ్ యూనిట్ కమిటీ సభ్యులు ఒకచోట సమావేశమై ప్రజల నుండి వచ్చిన అర్జీలు ఎలా పరిష్కారం చేయాలి అనే విషయం పైన చర్చించడంతోపాటు మళ్లీ మళ్లీ వస్తున్న అర్జీదారులతో నేరుగా మాట్లాడి వారికి అర్థమయ్యేలా వాస్తవ విషయాలను వివరించామని సంబంధిత అధికారులు జిల్లా కలెక్టర్‌కు తెలిపారు. ఆ విధంగా చేయడంతో ప్రజలు సంతృప్తి చెందుతున్నారని వారు వివరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం కార్యక్రమ ఉద్దేశం నెరవేరాలంటే క్షేత్రస్థాయిలో అధికారులందరూ కలిసికట్టుగా పని చేయాలన్నారు. ఈ కార్యక్రమం పై జిల్లా వ్యాప్తంగా ప్రజలందరికీ సంపూర్ణ అవగాహన కలిగించాలన్నారు. అత్యధికంగా దరఖాస్తులు వస్తున్న ప్రదేశానికి నేరుగా వెళ్లి అక్కడి ప్రజలతో మమేకమై వారి సమస్యలను

సానుకూలంగా ఆలకించి వారికి అర్థమయ్యే విధంగా వివరించి సమస్యను పరిష్కరించాలన్నారు. పదే పదే పెట్టుకుంటున్న అర్జీదారులతో మాట్లాడి ఎందుకు చేయలేకపోతున్నామో వివరించాలన్నారు.తమ దగ్గరికి అధికారులు అందరూ వచ్చి తమ సమస్యను ఓపిగ్గా విని పరిష్కరిస్తున్నారనే భావన ప్రభుత్వం అండగా ఉంటుందనే భరోసా అర్జీదారుల్లో రావాలన్నారు. ముఖ్యంగా రెవెన్యూ, పోలీసు, పంచాయతీరాజ్, పురపాలక శాఖల్లో ప్రధాన సమస్యలు ఉంటాయని ప్రతిరోజు సమీక్షిస్తూ పరిష్కార దిశగా ముందడుగు వేసి నూతన ఒరవడికి శ్రీకారం చుట్టాలన్నారు. జిల్లాలో ఆన్‌లైన్,ఆఫ్‌లైన్ కింద నమోదైన ధాన్యం సేకరణకు సంబంధించిన బిల్లులు త్వరగా చెల్లింపులు జరపాలన్నారు. సోమవారం మచిలీపట్నం డివిజన్లో రెండు కోట్ల రూపాయలు, గుడివాడ డివిజన్లో 1.2 కోట్ల రూపాయలు, ఉయ్యూరు డివిజన్లో 72 లక్షల రూపాయలు చెల్లించడం జరిగిందని మిగిలిన 15 కోట్ల రూపాయలను వచ్చే వారంలోగా సంబంధిత రైతులకు చెల్లించే ఏర్పాట్లు చేయాలని పౌరసరఫరాల సంస్థ డిఎం శ్రీధర్ కు సూచించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరనే రైతులకు చెల్లించాలని, ఏ ఒక్క రైతు నష్టపోకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఈ టెలి కాన్ఫరెన్స్‌లో ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, తహశీల్దార్లు, తదితర అధికారులు పాల్గొన్నారు.

అదృశ్యమైన బాలుడి ఆచూకీ లభ్యం

ప్రజాశక్తి - మచిలీపట్నం అర్బన్

కృష్ణాజిల్లా మచిలీపట్నంలో సోమవారం ఓ మైనర్ బాలుడు అదృశ్యమయ్యాడు. బాలుడిని 24 గంటల్లో పోలీసులు గుర్తించి పట్టుకున్నారు. విజయవాడ రవీంద్రభారతిలో ఆరో తరగతి చదువుతున్న విద్యార్థి చెన్నపాయి వరుణ్ సాయి (11) తల్లి చనిపోవడం, తండ్రి పట్టించుకోక పోవడంతో మేనమామ వద్దనే ఉంటున్నాడు. బాలుడు వేసవి సెలవులకు తనను చదివిస్తున్న హైదరాబాదుకు చెందిన సమీప బంధువు వద్దకు వెళ్లేందుకు నిర్ణయించుకున్నాడు. అయితే బాలుడు కోరినట్లు హైదరాబాద్ పంపకుండా మేనమామ మచిలీపట్నంలోని బందరకోటకు తీసుకొచ్చాడు. కొన్ని రోజుల పాటు మేనమామ ఇంట్లో ఉన్న బాలుడు ఎవరికీ తెలియకుండా హైదరాబాద్ వెళ్లిపోవడంతో పోలీసులకు మేనమామ ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అందుకున్న 12 గంటల వ్యవధిలో బాలుడు హైదరాబాదులో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. జిల్లా ఎస్పీ పి జాషువా ఆదేశాల మేరకు డిఎస్పీ ఆధ్వర్యంలో ఆర్ పేట సిఐ రవికుమార్ పర్యవేక్షణలో హైదరాబాదులో ఉన్న బాలుడిని గుర్తించి పట్టుకున్నారు.

వదంతులు నమ్మొద్దు: సిఐ రవికుమార్

బాలుడు కిడ్నాపుపై ప్రజల్లో లేనిపోని అనుమానాలు కల్పించే విధంగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడాన్ని ఆర్ పేట సిఐ రవి కుమార్ ఖండించారు. బాలుడు తండ్రి వదిలేసి వెళ్లిపోవడం, తల్లి కొన్ని నెలల క్రితం చనిపోవటంతో మేనమామ పర్యవేక్షణలో విజయవాడలో చదువుకుంటున్న బాలుడు సెలవులు కావడంతో తిరిగి మేనమామ వద్దకు వచ్చాడన్నారు. బాలుడు ఉద్దేశపూర్వకంగా హైదరాబాదులోని తన బంధువుల ఇంటికి వెళ్లాలని నిర్ణయించుకుని బందరు కోట నుండి కోనేరు సెంటర్ లిఫ్ట్ అడిగి చేరుకున్నాడన్నారు. అక్కడ నుండి విజయవాడ టాటా ఏసిలో ప్రయాణించి విజయవాడలో తన స్నేహితుని వద్ద రాత్రి బస చేసి, మరునాడు ఉదయమే విజయవాడ నుండి హైదరాబాద్ వెళ్లాడని గుర్తించామని తెలిపారు.

బాధితులకు నష్టపరిహారం చెల్లించాలి

ప్రజాశక్తి-గన్నవరం

పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణాన్ని వెంటనే పూర్తిచేసి నిర్వాశితులకు నష్టపరిహారం చెల్లించాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దేగ ప్రభాకరావు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. మంగళవారం గన్నవరం సిపిఐ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పోలవరం ప్రాజెక్ట్ 45 మీటర్ల ఎత్తు నిర్మాణం చేస్తే 7 లక్షల 20 వేల ఎకరాల సాగునీరు అందుతుందని, 20 లక్షల ఎకరాల నీటి స్థిరీకరణ ఏర్పడుతుందన్నారు. కర్ణాటకలో ఆల్మట్టి డ్యామ్ నిర్మించిన తర్వాత కృష్ణాడెల్టా బీడుగా మారిందన్నారు. కృష్ణా, గోదావరి నదుల అనుసంధానం వల్ల బీడువారిన కృష్ణాడెల్టాలో మళ్లీ పంటలు సమృద్ధిగా పండుతాయన్నారు. సిపిఐ ఆధ్వర్యంలో పోలవరం నుండి అమరావతి వరకు పాదయాత్ర సన్నాహాల్లో భాగంగా గన్నవరం సిపిఐ కార్యాలయానికి ఆయన వచ్చారు. ఈ సమావేశంలో చలసాని రామారావు, మేధావుల ఫోరం సభ్యులు సి.వి.రావు, వాసుదేవరావు,కాట్రగడ్డ రామచంద్రరావు, కట్టవరపు విజయరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా వాటర్ ట్యాంక్

శ్లాబు, పిల్లర్లు శిథిలం...భయం గుప్పిట్లో గ్రామస్తులు

ప్రజాశక్తి ఘంటసాల

ఘంటసాల మండలం దేవరకోట గ్రామంలోని రక్షిత మంచినీటి ట్యాంక్ శిథిలావస్థకు చేరి ప్రమాద భరితంగా ఉంది. వాటర్ ట్యాంక్ శిథిల పరిస్థితికి చేరటంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. దాదాపు 60 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన ఈ వాటర్ ట్యాంక్ గత 35 సంవత్సరాల క్రితం నిర్మాణం

చేపట్టడం, ప్రస్తుతం కూడా దానిని వినియోగంలో ఉంచి వాడుతున్నారు. 3 వేల మంది జనాభా నివశించే దేవరకోట గ్రామస్తులకు ఈ వాటర్ ట్యాంక్ ద్వారా నీటి సరఫరా జరుగుతోంది. ట్యాంక్ శ్లాబ్ భాగం శిథిలమై పెచ్చులూడుతోంది. పిల్లర్ల నుంచి సిమెంట్ పెచ్చులూడి ఇనుప చువ్వలు దర్శనమిస్తున్నాయి. కనీసం వాటర్ ట్యాంక్ ఎక్కి ట్యాంక్ శుభ్రం చేయటానికి కూడా సిబ్బంది భయపడాల్సి వస్తోంది. ట్యాంక్ ఎక్కేందుకు గతంలో ఏర్పాటు చేసిన ఇనుప మెట్లు పూర్తిగా తుప్పు పట్టి ఎవరైనా పైకి ఎక్కితే పడిపోయే పరిస్థితి నెలకొంది. ఇంత ప్రమాద భరితంగా ఉన్న వాటర్ ట్యాంక్ ఒక వేళ కూలితే ఎలాంటి ప్రమాదం సంభవిస్తుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గ్రామంలోకి వెళ్లే రహదారి వెంబడే ఈ వాటర్ ట్యాంక్ ఉండటంతో నిత్యం వాహనదారులతోపాటు ప్రజలు ప్రయాణం సాగిస్తుంటారు. భారీ ట్యాంక్ కూలి ప్రమాదం సంభవిస్తే ఎవరు బాధ్యులని ప్రశ్నిస్తున్నారు. మరమ్మత్తులు చేపట్టినా ఉపయోగం ఉండదని ఈ వాటర్ ట్యాంక్ రూపం చూస్తేనే అర్థమవుతుంది. రోజు రోజుకి జనాభా సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో కొన్నిసార్లు నీటి సమస్యలు (మురుగు నీరు) తలెత్తినా వాటర్ ట్యాంక్ శుభ్రపర్చటం కష్ట సాధ్యమైన పనిగా మారింది. ట్యాంక్ శ్లాబు పెచ్చులూడిపోవటంతో ఏ క్షణాన ఏమి జరుగుతుందో అర్థం కాక ప్రజలు భయపడుతున్నారు. మండల స్థాయి అధికారులు స్పందించి ఈ వాటర్ ట్యాంక్ తొలగించి కొత్త వాటర్ ట్యాంక్ నిర్మించడం ద్వారా ప్రజలకు నీటి సమస్య తలెత్తకుండా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

చంద్రబాబును సిఎం చేయాలి : వర్ల, రావి

ప్రజాశక్తి-పెదపారుపూడి

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో వైసిపి ఓడించటం ద్వారా తెలుగుదేశం పార్టీని గెలిపించి సిఎంగా నారా చంద్రబాబునాయుడుకు తిరిగి పట్టం కట్టాలని

పామర్రు, గుడివాడ నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జులు వర్ల కుమార్ రాజా, రావి వెంకటేశ్వరరావు అన్నారు. పెదపారుపూడి మండలం దోసపాడు గ్రామంలో సజ్జా శివయ్య మనవడు మొదటి పుట్టినరోజు వేడుకలు మంగళవారంనాడు జరిగాయి. ఈ సందర్భంగా వర్ల, రావి మాట్లాడారు. రాష్ట్రంలో వైసిపి పరిపాలన సరిగా లేదన్నారు. టిడిపి పట్ల ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి పెదపారుపూడి మండల అధ్యక్షులు చలసాని రమేష్, కార్యదర్శి మసిముక్కు రాంబాబు, బాబూరావు, చెరుకూరు విజయ్ కుమార్, చెరుకూరు రమేష్, కలపాల కిషోర్, దానబోయిన వెంకట నారాయణ, కూచిపూడి సుబ్బయ్య, జెమ్మీ బాబు, అభిమన్యుడు, జాజుల రమేష్, విజయ ప్రకాష్, గోగం రామారావు, సుభాష్, టిడిపి గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి రాకుండా చూడాలి : డిపిఒ

ప్రజాశక్తి-ఉంగుటూరు

ఉంగుటూరు మండలం పరిషత్ కార్యాలయం నందు జిల్లా పంచాయతీ అధికారి నాగేశ్వర నాయక్ అధ్యక్షతన స్వామిత్ర సర్వే, పన్నులు వసూలు, జగనన్న స్వచ్ఛ సంకల్పం పై గ్రామ పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం మంగళవారం

మాట్లాడుతున్న డిపిఒ నాగేశ్వరనాయక్

నిర్వహించారు. ప్రగతి పై కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశారు. పన్నుల వసూళ్లపై దృష్టి పెట్టాలని చెప్పారు. పంచాయతీలో ఆదాయం పెంపుదల మార్గాలను అన్వేషించాలని ఆయన సూచించారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి వేసవిలో నీటి ఎద్దడి రాకుండా చూసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమములో ఎంపిడిఒ జి.ఎస్.వి శేషగిరిరావు, ఈవోపీఆర్డి అమీర్ బాష ఇ.ఓ (పి.ఆర్ అండ్ ఆర్‌డి), పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలపై చర్యలు తీసుకోవాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్

కృష్ణా యూనివర్శిటీ పరిధిలోని డిగ్రీ కళాశాలకు ఈనెల ఒకటి నుంచి సెలవులు ప్రకటించినా కొన్ని కొన్ని డిగ్రీ కళాశాలలు అమలు చేయకుండా ఇష్టారాజ్యంగా

బాబురెడ్డికి వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

వ్యవహరిస్తున్నాయని ఎస్ఎఫ్ఐ నాయకులు తెలిపారు. ఇప్పటికే ఎండ తీవ్రత పెరిగి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కొన్ని కళాశాలలకు ఇవేమీ పట్టకపోవటం సరికాదని పేర్కొన్నారు. పెరిగిన ఉష్ణోగ్రతలు, వడగాలుల దృష్ట్యా విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని వర్శిటీ ప్రకటించిన సెలవులు అమలు చేయాలని కోరారు. వర్శిటీ ఆదేశాలను అమలు చేయని కళాశాలపై తగు చర్యలు తీసుకోవాలని మంగళవారం కృష్ణా యూనివర్శిటీ రిజిస్ట్రార్ బాబురెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఎస్ఎఫ్ఎస్ఐ జిల్లా నాయకులు వి.కీర్తి, సిహెచ్ కిరణ్ పాల్గొన్నారు.

పుణ్యాచారిటీస్ రూ.1.50 లక్షల విరాళం

ప్రజాశక్తి-గన్నవరం

గన్నవరం మండలం చిన్న అవుటపల్లికి చెందిన పుణ్యాచారిటీస్ సంస్థ ఆర్గనైజర్ జస్టి విజయ భూషణ్ కుమార్ తోటపల్లిలోని హీల్ ప్యారడైజ్ సంస్థకు రూ.1.50 లక్షలు విరాళంగా మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనాథ పిల్లల అభివృద్ధికి విశేష కృషి చేస్తున్న హీల్ ప్యారడైజ్ సంస్థకు తన వంతు సాయం చేయడం పట్ల సంతోషం వ్యక్తంచేశారు. జీవితంలో ప్రతి మనిషి సంపాదిస్తాడని అయితే దానిలో కొంత సమాజ సేవ కోసం ఖర్చు చేసిన వారి జీవితానికి

సార్థకత చేకూరు తుందన్నారు. హీల్ సంస్థ డైరెక్టర్ ధనప్రకాష్ తన స్నేహితులతో కలిసి తోటపల్లి అనే పల్లెటూరులో ఆశ్రమం ఏర్పాటు చేయడమే కాకుండా ఎంతోమంది అభాగ్యులైన పిల్లల జీవితాల్లో వెలుగులు నింపేందుకు చేస్తున్న కృషిని ప్రశంసించారు. రిటైర్డ్ అధ్యాపకులు గన్నె వెంకట్రావు పాల్గొన్నారు.

వ్యాధులకు మూలకారణం అధిక రక్తపోటు

- ప్రముఖ ఎండోక్రైనాలజిస్ట్ డాక్టరు రాకేష్ బొబ్బా
- నేడు ప్రపంచ రక్తపోటు దినోత్సవం

ప్రజాశక్తి-హెల్త్ యూనివర్శిటీ: హృదయ సంబంధ వ్యాధులకు ముఖ్యంగా హార్ట్‌ఎటాక్, హార్ట్ ఫెయిల్యూర్, పక్షవాతం, దీర్ఘకాలిక మూత్రపిండ వ్యాధి, అంగస్తంభన వంటి ఇతర సమస్యలను అధిక రక్తపోటు మూలకారణమని రమేష్ హాస్పిటల్ ఎండోక్రైనాలజిస్ట్ డాక్టరు రాకేష్ బొబ్బా తెలిపారు. మే 17న ప్రపంచ రక్తపోటు దినోత్సవం సందర్భంగా ఆయన 'ప్రజాశక్తి'కి పలు విషయాలు చెప్పారు. సరైన రోగ నిర్ధారణ, నిర్వహణకు ఖచ్చితమైన బ్లడ్ ప్రెషర్ కొలత అవసరం. సుమారు 20 నుండి 40 శాతం మందిలో రక్తపోటును సరైన పద్ధతిలో కొలవకపోవడం వల్ల వారిలో అవసరం లేకుండానే మాత్రలు వాడాల్సి వస్తుంది. నిజంగా మాత్రలు అవసరమైన వారు మాత్రలు ఉపయోగించడం లేదు. బి.పి పరీక్షించటానికి అరగంట ముందు వరకు ఎటువంటి ఆహారం, టీ, కాఫీ వంటివి తీసుకోకూడదు. వ్యాయామం చేయకూడదు. బిపి పరీక్ష చేయించుకునే ముందు రెండు మూడు నిమిషాల పాటు ప్రశాంతంగా కూర్చోవాలి. ఆ ప్రదేశం నిశ్శబ్దంగా ఉండాలి. పరీక్ష సమయంలో ఇతరులతో మాట్లాడకూడదు. కుర్చీలో సౌకర్యవంతంగా కూర్చుని చేతిని ముందు ఉన్న టేబుల్ పై పెట్టి పాదాలు నేలకు ఆనునేలా కూర్చోవాలి. బీపీని కొలవడానికి ఉపయోగించే పరికరాన్ని సమయానుసారంగా క్యాలిబ్రేషన్ చేసుకోవాలి. అధిక రక్తపోటును ఒకే రీడింగ్‌తో కాకుండా రెండు నుండి మూడు రీడింగ్లను తీసుకొని వాటి సగటు రీడింగ్ నుబట్టి నిర్ధారించాలి. సెకండరీ హైపర్‌కు ముఖ్యమైన కారణాలు కిడ్నీ సమస్యలు, మరియు హార్మోన్ సమస్యలు. హార్మోన్ సమస్యలు ముఖ్యంగా హైపోథైరాయిడిజం, క్యూషింగ్ సిండ్రోమ్ వంటి ఎడ్రినల్ సమస్యలు సెకండరీ హైపర్‌టెన్షన్‌కు దారితీస్తాయి. హార్మోన్, కిడ్నీ సమస్యలను నయం చేయడం ద్వారా రక్తపోటును సులభంగా కంట్రోల్ చేయవచ్చు, అలాగే జీవితాంతం బిపి మందులు వాడాల్సిన అవసరం ఉండదు. ఎవరైతే అధిక రక్తపోటుతో బాధపడుతున్నారో వారందరూ క్రమం తప్పకుండా ఇసిజి, 2డి ఇకో, క్రియేటిన్ వంటి పరీక్షలు ఎప్పటికప్పుడు చేయించుకుంటే మంచిది.

అధిక రక్తపోటును కేవలం మందులతో మాత్రమే కాకుండా జీవనశైలి మార్పుల ద్వారా సులభంగా నియంత్రించవచ్చు. రోజూ వ్యాయామం, యోగా, ధ్యానం చేయడం, ఇష్టమైన సంగీతం వినడం, బరువు తగ్గటం, ధూమపానం, మద్యపానం మానివేయడం, రోజు ఉప్పు తక్కువ మోతాదులో తీసుకోవడం, కొవ్వు తక్కువ ఉన్న ఆహారం తీసుకోవటం, తాజా పండ్లు, కూరగాయలు ఎక్కువ మోతాదులో తీసుకోవడం లాంటి జీవనశైలి మార్పుల ద్వారా అధిక రక్తపోటును చాలామంది మందుల సహాయం లేకుండానే తగ్గించుకోవచ్చు. జీవనశైలి నిర్వహణ అనేది హైపర్‌టెన్షన్ చికిత్సలో ఒక ముఖ్యమైన భాగం. ఇవన్నీ పాటించిన తర్వాత కూడా ఎవరికైతే అధిక రక్తపోటు ఉంటుందో అలాంటి వారు క్రమం తప్పకుండా బిపి మాత్రలు వాడాల్సి ఉంటుంది. అలా చేయడం ద్వారా దీర్ఘకాలిక సమస్యలు రాకుండా నివారించవచ్చు. ముఖ్యంగా కిడ్నీ సమస్యలు, పక్షవాతం, గుండె సమస్యలు రాకుండా కొంతవరకు నియంత్రించవచ్చు.

పల్లగిరిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-నందిగామ: ప్రజలకు సంక్షేమ పథకాల ద్వారా మేలు చేయడంతో పాటు ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి గ్రామాల్లో మౌలిక వసతులు కల్పనకు పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తున్నారని నందిగామ ఎంఎల్ఎ మొండితోక జగన్ మోహన్ రావు పేర్కొన్నారు. నందిగామ మండలం పల్లగిరి గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం నిధులు రూ.20 లక్షలతో సిసి రోడ్లు సిసీ డ్రైనేజీల నిర్మాణాలకు నందిగామ ఎమ్మెల్యే మొండితోక జగన్మోహన్ రావు మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రవికిరణ్ రెడ్డి, చిలుకూరి బుచ్చిరెడ్డి, ఎంపీటీసీ వేల్పుల రాము, మాజీ ఎంపీటీసీ కటారపు సురేష్ బాబు, కో ఆప్షన్ అలీషా, నాయకులు మానుకొండ కష్ణారెడ్డి, చాగంటి శ్రీనివాస్‌రెడ్డి, నెలకుదిటి శివ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ అడ్మిషన్లు ప్రారంభం

ప్రజాశక్తి-తిరువూరు: ఈ విద్యా సంవత్సరంలో మొదటి సంవత్సరం ఇయర్ ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు అడ్మిషన్లు జరుగుతున్నాయని తిరువూరు ప్రభుత్వ జూని యర్ కళాశాల ప్రిన్సిపాల్ రెబ్బు మురళికష్ణ తెలిపారు. 10వ తరగతి పాసైన విద్యార్థులు, తల్లిదండ్రులకు ప్రిన్సిపాల్ అధ్యాపకులతో కలిసి కళాశాలలో గల కోర్సులు, ఫలితాలను, సౌకర్యాలను తెలియ చేస్తూ అడ్మిషన్ల కొరకు తిరువూరు పట్టణంలో, మండలంలోని గ్రామాల్లో ప్రచార కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు.

నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలి

ప్రజాశక్తి-తిరువూరు: ఆధునిక కాలంలో ఎదురయ్యే సమస్యలను అధిగమించాలంటే ఇతరులతో కలిసి పని చేయగలిగే నాయకత్వ లక్షణాలను అభివద్ధి చేసుకోవాలని ఆంగ్ల భాష ఉపాధ్యాయ సంఘ కన్వీనర్ ఎం.రాంప్రదీప్ అన్నారు. తోసా ఆధ్వ ర్యంలో తిరువూరు నాగార్జున ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఉచిత ఆంగ్ల శిబిరంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ మాతభాషతో పాటు, ఆంగ్ల భాషపై కూడా పట్టు సంపాదిస్తేనే, భావవ్యక్తీకరణ నైపుణ్యాలు పెర గటానికి అవకాశం ఉంటుందని వివ రించారు. నిరంతరం ఆంగ్ల దిన పత్రికలను చదవటం, ఇంగ్లీష్ వార్తలను వినడం ద్వారా ఆభాషపై పట్టు సాధిం చవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంగ్ల అధ్యాపకులు బాబురావు తదితరులు పాల్గొన్నారు.

వేసవి విజ్ఞాన శిబిరం

ప్రజాశక్తి-కంచికచర్ల: కంచికచర్ల శాఖా గ్రంధాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం మంగళవారం తొమ్మిదో రోజుకు చేరింది. అంతర్జాతీయ కాంతి దినోత్సవం సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు పండిట్ మాస్టర్ యెస్.కె ఇస్మాయిల్ లేజర్ కిరణాలు ద్వారా వైద్య చేయడం ఎలా అని వివరించారు. అనంతరం విద్యార్థులకు 12 టేబుల్స్ నేర్పించారు. కవి, డ్రాయింగ్ మాస్టర్ నీలం సర్వేశ్వరరావు కాంతి కిరణాలు చిత్ర పటాన్ని గీశారు. యోగా మాస్టర్ నారాయణ యోగా నేర్పినారు. ఈ కార్యక్రమంలో గ్రంధాలయాధికారి ఎ.రామచంద్రుడు, రిటైర్డ్ లైబ్రేరియన్ రంగిశెట్టి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

యంత్రాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-మైలవరం: రైతులు కోసం ప్రభుత్వం అందించే యంత్ర పరికరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఎంసీ చైర్మన్ అప్పిడి సత్యనారాయణ రెడ్డి సూచించారు. మండలంలోని పుల్లూరు గ్రామంలో వైఎస్ఆర్ యంత్ర సేవ కేంద్రం ద్వారా ప్రభుత్వం రైతుల అందించిన రోటవేటర్, ట్రాక్టర్ రైతు మిత్ర గ్రూపులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమనిరైతు పక్షపాతిగా సీఎం జగన్ పేరు సంపాదిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పుల్లూరు పిఎసిఎస్ అధ్యక్షులు చిలుకూరు రామిరెడ్డి,ఏవో సంధ్యారాణి, సర్పంచ్ నాగమల్లేశ్వరి రైతులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు బకాయిలు చెల్లించాలి

ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కల్యాణ్

కూలీలతో మాట్లాడుతున్న కోట కల్యాణ్

ప్రజాశక్తి-విజయవాడ రూరల్

ఉపాధి హామీ కూలీలకు వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. విజయవాడ రూరల్ మండలం నున్న, పాతపాడు, మంగళాపురం గ్రామాల్లో ఉపాధి హామీ సమస్యలు అధ్యయనం కోసం ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి కోట కళ్యాణ్, ప్రజా సంఘాల నాయకులు సోమేశ్వరరావు, రంగారెడ్డి, చినవెంకటరెడ్డి మంగళవారం పని ప్రదేశాల వద్దకు వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కూలీలు మాట్లాడుతూ ఉదయం ఆరు గంటల నుండి పనిచేస్తున్నా రెండు పూటలా ఫోటో అప్డేట్ పేరుతో 12 గంటల వరకు ఎటువంటి సౌకర్యాలు లేకుండా ఎండలో గడపవలసి వస్తుందన్నారు. వేతన బకాయిలు చాలా మందికి రావాలని, జనవరి నుండి మే 13 వరకు దాదాపుగా 14 వారాలు బకాయిలు ఉన్నాయని కూలీలు వివరించారు. ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్‌కు సంబంధించి వారం చొప్పున మాత్రమే డబ్బులు అకౌంట్లో పడ్డాయని తెలిపారు. చేసిన పనికి ప్లే స్లిప్ ఇస్తే ఏ వారం ఎంత పడిందో తెలుసుకోవటానికి అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆరేపల్లి రంగమ్మ, విజయలక్ష్మి, ఏసుమ్మ, దుర్గా, భారతి, రెడ్డి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కాళ్లు, పాదాల వాపులకు రేడియాలజీ చికిత్స

ప్రజాశక్తి-హెల్త్ యూనివర్శిటీ: కాళ్ల వాపులు, పాదాల వాపులు రావడానికి కారణాలు ఎన్నో ఉంటాయని, వాటిల్లో సిరలు మూసుకుపోవడం వల్ల వచ్చే వాపులు కూడా ప్రధానమైనవని, వీటి చికిత్సకు ఇంటర్వెన్షనల్ రేడియాలజీ ఉత్తమమైన విధానమని అని ప్రముఖ ఇంటర్వెన్షనల్ రేడియోలజిస్ట్ డాక్టర్ యం.భవానీశంకర్ అన్నారు. బెంజిసర్కిల్ వద్ద గల వాసవ్య నర్సింగ్ హోమ్‌లో డాక్టర్ సమరం అధ్యక్షతన మంగళవారం 'కాళ్ల వాపు' అనే అంశంపై ఆరోగ్య సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాళ్ల మీద ఉండే సిరలు వాచిపోయి పైకి ఉబ్బుగా, నీలంగా తేలినప్పుడు సాధారణంగా బరువు తగ్గమని, కంప్రెషన్స్ స్టాకింగ్స్ వేసుకోమని చెబుతారన్నారు. కాని ఇటువంటి పద్ధతి వల్ల అంతగా ప్రయోజనం కనబడదన్నారు. ఎండోవాస్క్యులార్ లేజర్ ఎబిలేషన్స్ కూడా కాళ్ళ మీద ఉబ్బిన సిరల వాపుకి మరొక చికిత్సగా పేర్కొంటారన్నారు. మందుల విషయం తీసుకున్నట్లయితే యాంటికోయాగ్యులేషన్ థెరపీ ఉపయోగించడం ఉంటుందన్నారు. కాళ్ళ లోపల సిరలలో రక్తపు గడ్డలు ఏర్పడి మూసుకుపోయినప్పుడు కాళ్ళు, పాదాలు కూడా ఉబ్బిపోతాయన్నారు. అటువంటి సందర్భాలలో ఇంట్రవెన్షనల్

మాట్లాడుతున్న డాక్టర్ భవానీశంకర్

రేడియోలజీ ఎంతో ప్రయోజనకరమైనదని అన్నారు. కాళ్ళకి ఉండే సిరలు మూసుకుపోయి కాళ్ళ వాపులు, పాదాల వాపులు వచ్చినప్పుడు ఒక కాలు కావచ్చు, రెండు కాళ్ళు కావచ్చు తిమ్మిరిగా, బరువుగా అనిపించడం, సూదులు గుచ్చినట్లు నొప్పి, దురద, పుళు ్ళ వంటి లక్షణాలు ఏర్పడతాయన్నారు. వీటికి మూలాన్ని కనుగొనడానికి అల్ట్రాసౌండ్ స్కానింగ్ తోడ్పడుతుందన్నారు. సిరలలో రక్తపు గడ్డలతో అడ్డంకులు ఏర్పడినప్పుడు కలిగే వాపులకు ఇంట్రవెన్షనల్ రేడియోలజీ ఒక్కటే సరైన పరిష్కారమని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మారు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్

నగరంలోని ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న లక్ష్మీ మహాయజ్ఞానికి పాల్గొనే యాత్రికుల కోసం పీపుల్స్ మ్యాక్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్ ఉచితంగా చల్లని మజ్జిగను అందిస్తున్నట్లు సంస్థ చైర్మన్ అలమండ ఎల్లారావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం విజయవాడ నగరంలో రోజు రోజుకూ ఎండ తీవ్రత పెరుగుతున్న కారణంగా ఇక్కడకు వచ్చే యాత్రికులు దూర ప్రాంతాల నుండి వస్తున్నారని వారికి దాహార్తిని తీర్చడంతో పాటు ఎండ ఎడిమి నుండి తగ్గించడానికి మజ్జిగను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ ట్రెజరర్ జ్యోత్స్న, మేనేజర్లు జి.పరశురామ్, కె.అప్పారావు, ఎం.డి. ఇలియాజ్ పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

విటెరో టైల్స్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్

ప్రముఖ బిల్డింగ్ మెటీరియల్స్ సంస్థ అపర్ణ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ ఆధ్వర్యంలో విటెరో టైల్స్‌ను ఆవిష్కరించినట్లు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ అశ్విన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. టైల్స్ రంగంలో అగ్రగామిగా ఉన్న తమ సంస్థ రానున్న కాలంలో మరిన్ని టైల్స్ ఉత్పత్తులను మార్కెట్లోకి తీసుకువస్తున్నట్లు తెలిపారు. అంతర్జాతీయంగా నూతన ప్రాంతాలలో పెరుగుతున్న మార్కెట్ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని టైల్ సైజులను అధీకృత డీలర్ల ద్వారా మార్కెట్లోకి అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం
పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...
మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218
విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.